# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :157 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 26-08-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఐదు నెలల కమీషన్ డబ్బులు చెల్లించాలి..

ఖిలావరంగల్ : రాష్ట్ర రేషన్ డీలర్లకు ఏప్రిల్ నుండి ఆగష్టు వరకు 5నెలల కమీషన్ డబ్బులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని వరంగల్ జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం బాధ్యులు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టిన రూ.5,000 గౌరవ వేతనం, కమీషన్ పెంపును వెంటనే ప్రకటించాలని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంతో వచ్చేనెల 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క రోజు రేషన్ షాప్ లను బంద్ చేస్తున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలో రేషన్ డీలర్లుగా పనిచేస్తున్న మాకు ఏప్రిల్ నెల నుండి ఆగష్టు నెల వరకు 5 నెలల కమీషన్ డబ్బులు రాక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. సకాలంలో కమీషన్ డబ్బులు చెల్లించకపోతే వినాయక చవితి, బతుకమ్మ, దసరా పండుగలను కూడా జరుపుకోలేని పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర కమీషన్, రాష్ట్ర కమీషన్ అని వేరు వేరుగా కాకుండా ఒకే కమీషన్ డీలర్లకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని

## ఓయూలో సీఎం రేవంత్ రెడ్డి ఉగ్రరూపం



హైదరాబాద్, ఆగస్టు 25: తెలంగాణకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రత్యామ్నాయ పదమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అలాంటి ఉస్మానియా యూనివర్సిటీకి ఎంతో చరిత్ర ఉందన్నారు. దేశ రాజకీయాలను శాసించిన ఎంతో మంది నేతలు ఈ యూనివర్సిటీ నుంచి వచ్చిన విద్యార్థులేనని ఆయన గుర్తు చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహరావు కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి, మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి తదితరులంతా ఈ యూనివర్సిటీ విద్యార్థులేనని ఆయన సోదాహరణగా వివరించారు. కొందరు వ్యక్తులు.. ఉస్మానియా యూనివర్సిటీని కాలగర్భంలో కలపాలని చూశారని మండిపడ్డారు. కానీ ఓయూకు పూర్వ వైభవం తీసుకురావాలని తాము నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఆ క్రమంలో 108 ఏళ్ల చరిత్ర కలిగిన వర్సిటీకి దళితుడిని వీసీ చేసి చూపించామన్నారు.దేశానికి యువ నాయకత్వం అవసరమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమానికి పురిటి గడ్డ ఉస్మానియా వర్సిటీనేనని గుర్తు చేశారు. యూనివర్సిటీలు సమస్యలపై చర్చలకే కాదు..సైద్ధాంతిక అంశాలకు వేదిక సైతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సామాజిక, సాంకేతిక అంశాలపై చర్చలు జరపాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

### డ్రగ్స్, గంజాయిపై ఆందోళన..

రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి వేగంగా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువతను డ్రగ్స్, గంజాయి పట్టి పీడిస్తున్నాయని ఆవేదన చెందారు. విద్యా సంస్థల్లో చైతన్యవంతమైన చర్చలు లేక పోవడం వల్లే డ్రగ్స్ సమస్య ఉత్పన్నమవుతుందని చెప్పారు. చిన్న కాలేజీల్లో సైతం విద్యార్థులు గంజాయికి అలవాటుపడుతున్నారని తెలిపారు. పేదలకు పంచేందుకు భూములు లేవు.. ఖజానా ఖాళీగా ఉందన్నారు.

### మళ్లీ ఓయూకి వస్తా..

చదువు ఒక్కటే మిమ్మల్ని గుణవంతులు, ధనవంతులను చేసేదంటూ విద్యార్థులకు సీఎం రేవంత్ సూచించారు. మిమ్మల్ని ఇబ్బంది పెట్టేలా ఉన్న నిర్ణయాలను వ్యతిరేకించండి.. అందుకు నిరసన తెలపండంటూ విద్యార్థులకు క్లియర్ కట్‌గా సందేశాన్ని ఇచ్చారు. కానీ సమస్యలు పరిష్కరించేందుకు వచ్చిన వారిని మాత్రం అడ్డుకోకండంటూ విద్యార్థులకు ఆయన హితవు పలికారు. తాను మళ్లీ ఉస్మానియా యూనివర్సిటీకి వస్తానని స్పష్టం చేశారు.

### ఒక్క పోలీస్ కూడా ఉండకూడదు..

డిసెంబర్‌లో మళ్లీ ఆర్ట్స్ కాలేజీలోనే మీటింగ్‌కు హాజరవుతానన్నారు. తాను వచ్చే రోజు క్యాంపస్‌లో ఒక్క పోలీస్ కూడా ఉండొద్దన్నారు. విద్యార్థులను నిరసన చేసుకోనివ్వండంటూ పోలీసులకు సూచించారు. తానను అడ్డుకునే విద్యార్థులకు సమాధానం చెబుతానంటూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియం వేదికగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.అంతకుముందు.. ఓయూలో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. రూ. 90 కోట్లతో నిర్మించిన హాస్టల్ భవనాలను సీఎం ప్రారంభించారు. అలాగే హాస్టల్ భవనాలు, డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూమ్ భవనాలను సైతం సీఎం రేవంత్ ప్రారంభించారు. దాదాప 20 ఏళ్ల తర్వాత ఉస్మానియా యూనివర్సిటీకి సీఎం రేవంత్ రెడ్డి విచ్చేశారు. ఓయూకి సీఎం రాక సందర్భంగా పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు సీఎం పర్యటన సందర్భంగా యూనివర్శిటీలోని విద్యార్థులు ఆందోళనకు దిగనున్నారంటూ పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

## పోలీసు బలం,బలగంతో విద్యార్థుల నిరసన జ్వాలలను చల్లార్చలేరు



హైదరాబాద్: సీఎం రేవంత్ ఉస్మానియా యూనివర్సిటీ పర్యటన నేపథ్యంలో విద్యార్థులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజంపై నిషేధాజ్ఞలు విధిస్తారా అని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నదని చెప్పారు కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా రేవంత్ రెడ్డి చేసిందేముందన్నారు. జాబ్‌క్యాలెండర్‌ను జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని మండిపడ్డారు.'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి వస్తున్న సందర్భంగా విద్యార్థులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామిక, పిరికిపంద చర్య. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఒక్క విద్యార్థి మీద పోలీసు లాఠీ పడినా తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరిస్తున్నాం. ఇందుకేనా విద్యాశాఖను, హోం శాఖను మీ వద్ద పెట్టుకున్నది. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నది. మొత్తం తెలంగాణ సమాజం మీద నిషేధాజ్ఞలు విధిస్తారా?. ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్య పాలన అని చెప్పి, ఎమర్జెన్సీ రోజులను తిరిగి తెచ్చిండు రేవంత్ రెడ్డి.కేసిఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇవ్వడం. కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా నువ్వు చేసింది ఏముంది రేవంత్ రెడ్డి?. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేసారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేసారు. నిరుద్యోగ భృతి పేరిట నయవంచన చేసారు. 22నెలల్లో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నావు. నీ తప్పుడు ప్రచారంపై కడుపు మండిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నవు.నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నవు. గ్రంథాలయాల్లో పోలీసు లాఠీ చార్జీలు జరిపించిన అరాచక చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది. విద్యార్థులు, నిరుద్యోగుల వీపులు పగుల గొట్టిన అమానుష పాలన కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఆంక్షలతో, నిషేధాలతో నిరుద్యోగుల హృదయాల్లో రగులుతున్న నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఇనుప కంచెలు, బ్యారికెడ్లతో ప్రజా తిరుగుబాటును ఆపలేరు. పోలీసు బలం, బలగంతో విద్యార్థుల నిరసన జ్వాలలను చల్లార్చలేరు.ఉస్మానియా విద్యార్థి, నిరుద్యోగులు సింహాలై గర్జిస్తరు. ఉద్యోగాల పేరిట మీరు చేసిన మోసాన్ని ఎక్కడిక్కడ నిలదీస్తరు. మోసం చేసినందుకు ఉస్మానియా సాక్షిగా విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.' అని హరీశ్ రావు అన్నారు.

## దివ్యాంగులపై జోకులేంటి? కమెడియన్లపై సుప్రీంకోర్టు సీరియస్



న్యూఢిల్లీ,స్టాండప్ కమెడియన్లపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సీరియస్ అయింది. దివ్యాంగులపై షోల్లో జోక్‌లు వేయడంపై తీవ్రంగా తప్పుపట్టింది. తక్షణమే సోషల్ మీడియా వేదికగా క్షమాపణలు చెప్పాలని ఆదేశించింది.జరిమానాలు కూడా తప్పవని హెచ్చరించింది.జోక్‌ల పేరుతో దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు వేయడాన్ని ఎస్ఎంఏ క్యూర్ ఫౌండేషన్ తప్పుపట్టింది. కమెడియన్లు సమయ్ రైనా, విపున్ గోయల్, బాల్‌రాజ్ పరమ్‌జీత్ సింగ్, సోనాలి ఠక్కర్ తదితరులను బాధ్యులుగా పేర్కొంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఈ మేరకు వాదనలు విన్న సర్వోన్నత న్యాయస్థానం.. సోమవారం వారిపై సీరియస్ అయింది. తక్షణమే మీ సోషల్ మీడియా ఛానెల్స్‌లో క్షమాపణ చెప్పాలని సూచించింది. కామిక్స్ తమ యూట్యూబ్ ఛానెల్‌లో క్షమాపణ పోస్ట్ చేయాలని.. వారు భరించడానికి సిద్ధంగా ఉన్న జరిమానా గురించి కోర్టుకు తెలియజేయాలని ఉత్తర్వులో పేర్కొంది.ఫౌండేషన్ తరఫున సీనియర్ న్యాయవాది అపరాజిత సింగ్ వాదనలు వినిపించారు. కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి వాదనలు వినిపించారు. కామిక్స్, ఇన్‌ఫ్లుయెన్సర్లకు మార్గదర్శకాలను రూపొందించడానికి కేంద్రం కొంత సమయం తీసుకుంటుందని వెంకటరమణి అన్నారు. మార్గదర్శకాలు ఒక సంఘటనకు ప్రతిస్పందనగా ఉండకూడదని ధర్మాసనం పేర్కొంది. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకోవాలని.. మేము డొమైన్ నిపుణుల అభిప్రాయాన్ని కూడా కోరుకుంటున్నట్లు జస్టిస్ కాంత్ అన్నారు.సుప్రీంకోర్టు బలమైన సందేశం పంపిందని సీనియర్ న్యాయవాది అపరాజిత సింగ్ చెప్పినప్పుడు.. జస్టిస్ కాంత్ బదులిస్తూ.. "క్షమాపణ ఒక విషయం%ౌ% కానీ దీని కోసం ప్రతిసారీ ఒక ఫౌండేషన్ కోర్టుకు వెళ్లాల్సిన అవసరం ఉందా? ఎవరైనా వ్యక్తి బాధితులైతే ఏమి చేయాలి?" అన్నారు. జస్టిస్ బాగ్చి మాట్లాడుతూ.. "హాస్యం జీవితంలో ఒక భాగం. మనం మనల్ని జోకులుగా చేసుకోవచ్చు. కానీ మీరు ఇతరులను ఎగతాళి చేయడం కరెక్ట్ కాదు. సున్నితత్వం ఉల్లంఘన జరుగుతుంది. భారతదేశం చాలా సమాజాలతో కూడిన వైవిధ్యభరితమైన దేశం. నేటి ప్రభావశీలులు అని పిలవబడేవారు.. ప్రసంగాన్ని వాణిజ్యకరించేటప్పుడు మనోభావాలను గాయపరచలేరు" అని అన్నారు.

## గృహ నిర్బంధంలో జగదీప్ ధన్‌ఖడ్..? అమిత్ షా ఏమన్నారంటే



న్యూఢిల్లీ, ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. అయితే, ధన్‌ఖడ్ రాజీనామాపై ప్రతిపక్షాలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు రాజీనామా తర్వాత నుంచి ఆయన ఎక్కడా కనిపించడం లేదు. ఆయన్ని కలిసేందుకు పలువురు రాజ్యసభ సభ్యులు ప్రయత్నించినా ఎలాంటి ఫలితం లేదు. ఆయన్ని సంప్రదించలేకపోతున్నారు. దీంతో 'జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడ..?' అంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ధన్‌ఖడ్ గృహనిర్బంధంలో లో ఉన్నారంటూ ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ధన్‌ఖడ్ రాజీనామాపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తాజాగా స్పందించారు. ఈ మేరకు 'హౌస్ అరెస్ట్' వార్తలను తీవ్రంగా ఖండించారు.ప్రముఖ జాతీయ మీడియా ఏఎన్ఐకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అమిత్ షా మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యల కారణంగా ధన్‌ఖడ్ రాజీనామా చేసినట్లు చెప్పారు. 'రాజీనామాకు గల కారణాలను ధన్‌ఖడ్ సాబ్ లేఖలో స్పష్టంగా చెప్పారు. ఆరోగ్య కారణాల రీత్యా ఆయన రాజీనామా చేశారు. ఆయన రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తి.. పదవిలో ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని అనుసరిస్తూ చక్కగా పని చేశారు. ఆయన రాజీనామా గురించి ఎక్కువగా ఊహించుకోవాల్సిన అవసరం లేదు. ఈ విషయాన్ని మరీ ఎక్కువగా లాగొద్దు. కేవలం ప్రతిపక్షాల ఆరోపణల ఆధారంగా దీనిపై ఓ అంచనాకు రావడం సరికాదు' అని అమిత్ షా స్పష్టం చేశారు.పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు జూలై 21న రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.మరోవైపు ధన్‌ఖడ్ రాజీనామాతో తదుపరి వీపీగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను బీజేపీ ప్రభుత్వం బరిలోకి దింపిన విషయం తెలిసిందే. ఇక విపక్ష ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి ఎంపిక చేశారు. వచ్చే నెల 9వ తేదీన ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉంది. ఈ నేపథ్యంలో రాధాకృష్ణన్ విజయం లాంఛనప్రాయమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సంఖ్యా బలం దృష్ట్యా చూస్తే ఆయన ఎన్నిక ఏకపక్షంగా జరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

## దాయాది దేశానికి భారత్ కీలక అలర్ట్..



జమ్మూ కాశ్మీర్: పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌తో భారత్ సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత సింధు జలాలను భారత్ నిలిపివేసింది. అంతేకాకుండా ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేసింది.దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత దిగజారాయి.ఇలాంటి తరుణంలో దయాది దేశం పాకిస్థాన్‌కు భారత్ కీలక అలర్ట్ జారీ చేసింది. తావి నదిలో వరదలు వచ్చే అవకాశం ఉందని భారత్ సూచించినట్లుగా పాకిస్థాన్‌కు చెందిన ది న్యూస్ మీడియా సంస్థ తెలిపింది. వరదలు వచ్చే అవకాశం ఉందని.. అప్రమత్తంగా ఉండాలని పాకిస్థాన్‌ను భారత్ సంప్రదించినట్లుగా మీడియా పేర్కొంది. ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ ఆదివారం ఈ హెచ్చరికను తెలియజేసిందని ఆ పత్రిక తెలిపింది.ఇక భారతదేశం అందించిన సమాచారం ఆధారంగా పాకిస్థాన్ అధికారులు హెచ్చరికలు జారీ చేసినట్లుగా పేర్కొంది. ఆగస్టు 30 వరకు పాకిస్థాన్‌లోని చాలా ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ హెచ్చరించింది. ఇక భారీ వర్షాలు కారణంగా శనివారం నాటికి 788 మంది చనిపోయారని.. 1,018 మందికి గాయాలయ్యాయని అధికారులు తెలిపారు.ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్ర దాడి జరిగింది. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతీకారంగా మే 7న భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. ఈ ఘటనలో పాకిస్థాన్‌లో 100 మంది ఉగ్రవాదులు చనిపోయారు. అంతేకాకుండా వైమానిక స్థావరాలు ధ్వంసమయ్యాయి. అనంతరం రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ జరిగింది.

## లైంగిక వేధింపుల ఎఫెక్ట్.. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే రాహుల్ సస్పెండ్



కేరళ:కేరళలో సంచలనం సృష్టించిన లైంగిక వేధింపుల వ్యవహారంలో కేరళ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాహుల్ మమ్‌కూటథిల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఆరోపణలు రాగానే ముందుగానే యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశాడు.తాజాగా అతడిని పార్టీ నుంచి కాంగ్రెస్ సస్పెండ్ చేసింది. పాలక్కాడ్ ఎమ్మెల్యే రాహుల్ మమ్‌కూటథిల్ కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసింది.మలయాళ నటి రిని ఆన్ జార్జ్, రచయిత్రి హనీ భాస్కరన్, ఒక ట్రాన్స్‌జెండర్, పలువురు మహిళలు.. ఎమ్మెల్యే రాహుల్‌పై తీవ్ర లైంగిక ఆరోపణలు చేశారు. హోటల్ గది బుక్ చేశాను.. అక్కడికి రావాలంటూ వేధిస్తున్నాడని.. సోషల్ మీడియాలో కూడా అభ్యంతరకర సందేశాలు పంపిస్తున్నాడని ఆరోపించారు. ఇదే కోవలో చాలా మంది మహిళలు ఉన్నారని వాపోయారు. ఇక కాంగ్రెస్ ఎమ్మెల్యే రాహుల్ వ్యతిరేకంగా పెద్ద ఎత్తున మహిళలు నిరసనలు వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలు, నిరసనలు తీవ్రం కావడంతో కాంగ్రెస్ అప్రమత్తమై పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.మలయాళ నటి జార్జ్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఒక ప్రధాన పార్టీకి చెందిన యువ నాయకుడు తనను లైంగికంగా వేధిస్తున్నాడని.. అభ్యంతరకరమైన సందేశాలు పంపిస్తున్నాడని వాపోయింది. హోటల్‌కు రావాలంటూ ఒత్తిడి చేస్తున్నాడని తెలిపింది. కానీ ఎక్కడా కూడా నిందితుడి పేరు ప్రస్తావించలేదు. ఇంతలోనే బీజేపీ జోక్యం పుచ్చుకుని పాలక్కాడ్ ఎమ్మెల్యే రాహుల్ రాజీనామా చేయాలని ఆందోళన చేపట్టింది. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కోరింది. పార్టీ కార్యాలయానికి మార్చ్ కూడా నిర్వహించింది.ఇదిలా జరుగుతుండగానే రచయిత్రి హనీ భాస్కరన్.. యువ ఎమ్మెల్యే రాహుల్ తనను లైంగికంగా వేధిస్తున్నాడంటూ బహిరంగంగానే పేరు ప్రస్తావించి ఆరోపణలు గుప్పించింది. నిరంతరం సందేశాలు పంపిస్తున్నాడని వాపోయింది. ఈ ఆరోపణలు చేసిన కొన్ని గంటలకే అవంతిక అనే ట్రాన్స్ మహిళ కూడా యువ ఎమ్మెల్యేపై సంచలన ఆరోపణలు చేసింది. తనపై అత్యాచారానికి ప్రయత్నించాడని తెలిపింది. తన కోరిక తీర్చాలంటూ అనేక సందేశాలు పంపించాడని ఆరోపించింది. బెంగళూరు లేదా హైదరాబాద్ వెళ్లి లైంగిక తృప్తి పొందుదామని చెప్పాడని ఆరోపించింది. ఎన్నికల సమయంలోనే రాహుల్‌ను కలిశానని.. కేవలం సాధారణ స్నేహం మాత్రమే జరిగిందని.. కానీ ఇంతలోనే తన కోరిక తీర్చాలంటూ అసభ్యకరమైన సందేశాలతో వేధించాడని అవంతిక తెలిపింది.అయితే మహిళల నుంచి ఆరోపణలు రావడంతో వెంటనే యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా చేశాడు. కానీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలంటూ మహిళలు పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు చేపట్టగా కాంగ్రెస్ అప్రమత్తమై పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

## ఎన్నికల సంఘం ఇలా ఉండటం మన దౌర్భాగ్యం



హైదరాబాద్: కరీంనగర్ బిజెపి ఎంపిలు దొంగ ఓట్లతో గెలిచారని టిపిసిసి ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. దొంగ ఓట్లతో గెలిచినట్టు తమ దగ్గర ఆధారాలున్నాయని అన్నారు. మహేష్ మీడియాతో మాట్లాడుతూ..బిజెపి కేంద్రమంత్రి బండి సంజయ్ కి మెజారిటీ ఎలా వస్తుంది? అని ఒకే డబుల్ బెడ్ రూమ్ ఇంట్లో 69 ఓట్లు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. బండి సంజయ్ అసలు బిసినే కాదని ఆయన దేశ్ ముఖ్ అని తెలియజేశారు. తెలంగాణలో ఓట్ల చోరిపై ఇసిని కలుస్తామని అన్నారు. ఎన్నికల సంఘం ఇలా ఉండటం మన దౌర్భాగ్యం అని ఆవేదనను వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఎంపి అర్వింద్ గెలుపుపై కూడా అనుమానం ఉందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## సంపాదకీయం

**మంగళవారం 26-08-2025**

# నిస్వార్థ రాజకీయ నేత సురవరం !

రాజకీయాల్లో స్వార్థపరులే తప్ప నిస్వార్థపరులు ఉండరు... అన్న కాలంలో నేనున్నానని చెప్పుకునే ఉదాత్త లక్షణాలు కలిగిన నేత సురవరం సుధాకర్ రెడ్డి. ఆజన్మాంతం సామాన్యుడిగా ఉంటూ..అసామాన్య రాజకీయ ప్రతిభను ప్రదర్శించిన వ్యక్తి సురవరం. ఆయన తెలుగువాడు కావడం మనమంతా గర్వించాలి. కమ్యూనిస్టు రాజకీయాల్లో ఉంటూనే దేశ రాజకీయాల్లో ప్రభావశీలమైన పాత్రపోషించారు. కమ్యూనిస్టులు ఏకం కావాలన్న ఆయన కోరిక మాత్రం తీరకుండానే పోయారు. పుట్టినవారు గిట్టక మానరు...అయితే జీవించినంత కాలం ఏం సాధించామన్నది ముఖ్యం. అదే సురవరంలో మనం చూస్తాం. ఎప్పుడూ ప్రజల గొడవతోనే ఆయన జీవితం ముడిపడి ఉండేది. తెలంగాన కమ్యూనిస్టు దిగ్గజాలలో గతేడాది సీతారాం ఏచూరిని కోల్పోయాం. ఏడాదిలోపే ఇప్పుడు సురవరంను కోల్పోయాం. జాతీయ రాజకీయాల్లో తెలుగువారు కనుమరుగు అవుతున్నారు. గట్టిగా నిలబడే నేతలు లేకుండా పోతున్నారు. ఈ క్రమంలో సురవం వృద్ధాప్య కారణాలతో మనలను వీడిపోయారు. ఆయన రాజకీయాల్లో అజాతశత్రువు... అంతకు మించి నిస్వార్థ రాజకీయ నేత. పీడిత,తాడిత వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన తెలంగాణ ముద్దుబిడ్డ... చెప్పాలంటే అరుదైన మట్టిమనిషి. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శిగా సురవరం సుధాకర్ రెడ్డి తనవంతుగా దేశానికి ఋషిలా పనిచేశారు. సమస్యలు ఎక్కడున్నా వాటికోసం పోరాడేందుకు ఎప్పుడూ ముందుండే వారు. సమస్యలపై ఎంత గట్టిగా పోరాడేవారో ఆయన అంతకుమంచి సౌమ్యుడు. ఆయన సౌమ్యత్వానికి, పోరాటానికి పొంతన ఉండేది కాదు. కానీ జన్మతః వచ్చిన మృదు స్వభావం కారణంగా ఆయన అజాత శతృవు అయ్యారేమో అనిపిస్తుంది. ఎందుకంటే సురవరం అంటే నచ్చని నేత ఉండేవాడు కాదు. ఆయన మాట్లాడినంత సేపు ఇంకా మాట్లాడాలనిపిస్తుందని అనేవారు. సాదాసీదాగా ఉంటూ జాతీయరాజకీయాల్లో చెలామణి కావడం కష్టం. కానీ అది సాధ్యమని రుజువు చేసిన దిగ్గజనేత సురవం. తెలంగాణ వైతాళికుడు, గోల్కొండ పత్రిక వ్యవస్థాపకుడు సురవరం ప్రతాపరెడ్డి తమ్ముడు వెంకటరామిరెడ్డి కుమారుడు సుధాకర్‌రెడ్డి. అందుకేనేమో అటు తండ్రి, ఇటు పెదనాన్న వారసత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్నారు. ఒకవైపు పెదనాన్న సాంస్కృతిక ఉద్యమ ఆదర్శాలను, మరోవైపు తండ్రి స్వాతంత్య్ర పోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్న సుధాకర్‌రెడ్డి... చిన్నవయసులోనే సమస్యలపై పోరుబాట పట్టిన తీరు అమోఘం. చిరు ప్రాయంలోనే ఆయన మెదడులో నాటుకున్న పోరాటస్ఫూర్తికి అది నిదర్శనంగా చూడాలి. కర్నూలులో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సమయంలో బ్లాక్‌బోర్డు, చాక్‌పీస్ వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంపై నిరసన చేపట్టారు. అది ఉద్యమంగా రూపుదిద్దుకొని నగరంలోని మిగతా విద్యాలయా లకు వ్యాపించింది. విద్యార్థి దశలోనే సమస్యలపై శంఖారావం పూరించడం యనకు అక్కడితోఏ అబ్బంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జాతీయ స్థాయి నేతగా సురవరం ఎదిగారు. దివంగత జైపాల్ రెడ్డితో పాటు ఆయన కూడా కమ్యూనిస్టు ఉద్యమంలో రాటుదేలారు. ఎన్నో వామపక్ష ఉద్యమాలు, ఎన్నో ప్రజా పోరాటాల్లో పాలు పంచుకున్నారు. రెండుసార్లు నల్గొండ పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన సురవరం సుధాకర్ రెడ్డి దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకుడని చెప్పక తప్పదు. ఆచన చేసిన పోరాటలు,ప్రజా ఉద్యమాల పట్ల ఉన్న నిబద్ధత కారణంగా ప్రజానేతగా సురవరం గొప్ప పేరు సంపాదించుకున్నారు. పీడిత వర్గాల అభ్యున్నతి కోసం జీవితకాలం కృషి చేశారు. తెలంగాణ మట్టి బిడ్డగా, మార్క్సిస్టు ప్రజానేతగా గొప్ప పేరు సంపాదించుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయనది విడదీయరాని అనుబంధం. ఏఐఎస్ఎఫ్ నుంచి ప్రారంభమైన ఆయన ప్రస్థానం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు సాగింది. 2012 నుంచి 2019వరకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పదవిలో కొనసాగారు. మూడు దఫాలుగా ఆయన జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. 2000 సంవత్సరంలో విద్యుత్ బిల్లుల పెంపునకు వ్యతిరేకంగా వామపక్షాలు చేసిన పోరాటంలో సురవరం సుధాకర్ రెడ్డి ముఖ్యపాత్ర పోషించారు. చంద్రరాజేశ్వరరావు తరువాత జాతీయ ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన రెండో తెలుగు వ్యక్తిగా సురవరం నిలిచారు. 1960లో ఏఐఎస్ఎఫ్ కర్నూలు పట్టణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆతర్వాత కర్నూలు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. 1962లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యా లయం కోసం ఏర్పాటు చేసిన సమ్మెకు కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ కమిటీ– 62రోజుల పాటు– చేసిన సమ్మెకు నాయకత్వం వహించారు. అనంతరం కర్నూలులోని కళాశాల విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1965లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌బీ చదువుతున్న సమయంలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో కళాశాల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ఫలితాల అనంతరం ఏఐఎస్ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాధ్యతలను సురవరానికి అప్పగించారు. 1966లో ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి అయ్యారు. దీంతో ఆయన ఢిల్లీకి మకాం మార్చారు. 1969లో రెండోసారి ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు. 1970లో ఏఐఎస్ఎఫ్, 1972లో ఏఐవైఎఫ్‌నకు జాతీయ అధ్యక్షుడయ్యారు. 1971లో కేరళలోని కొచ్చిన్‌లో జరిగిన సీపీఐ 9వ నేషనల్ కౌన్సిల్ సమావేశాల్లో జాతీయ కమిటీ–సభ్యుడయ్యారు. 1974లో తిరిగి ఆంధప్రదేశ్‌కు వచ్చిన సురవరం ఆనాటి నుంచి 1984 వరకు సీపీఐ ఉమ్మడి ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. 1985, 90లో కొల్లాపూర్ అసెంబ్లీ నుంచి సురవరం సుధాకర్ రెడ్డి పోటీ– చేసి ఓటమి చవిచూశారు. 1994లో కర్నూలులోని డోన్‌లో ముఖ్యమంత్రి విజయభాస్కర్‌రెడ్డిపై పోటీచేసి ఓడిపోయారు. 1998లో ఏపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఇలా ఒక్కో మెట్టు ఎక్కినా, ఒదిగే ఉన్నారు. ఇంతటి ఉన్నత లక్షణాలు, ఉదాత్త ఆశయాలు కలిగిన సురవరం మనవాడు కావడం మన అదృష్టం.

# బీఆర్ఎస్ కి కవిత ఎనీ టైం రిజైన్...

హైదరాబాద్,బీఆర్ఎస్ పార్టీ లో అత్యంత కీలక పరిణామం చోటు చేసుకోబోతుందా అన్నది చర్చగా ఉంది. బీఆర్ఎస్ అనే గులాబీ తోట అంతా అల్లుకుంది కేసీఆర్ కుటుంబం చుట్టూనే. కేసీఆర్ తెలంగాణా ఉద్యమం అంటూ పాతికేళ్ల క్రితం పోరాటం స్టార్ట్ చేశారు. మొదట్లో మేనల్లుడు హరీష్ రావు చేదోడు వాదోడుగా ఉన్నారు. ఆ తర్వాత కుమారుడు కేటీఆర్ కుమార్తె కవిత వచ్చి చేరారు. దాంతో ఆనాటి టీఆర్ఎస్ సకుటుంబ సపరివార సమేతంగా మారింది. ఇక పద్నాలుగేళ్ళ పోరాటం తరువాత బీఆర్ఎస్ సోలోగా అధికారంలోకి వచ్చింది. రెండు టెర్ములు పవర్ ని కూడా అందుకుంది. ఈ క్రమంలో కుటుంబానికి సైతం తగిన ప్రాధాన్యత దక్కింది. అలా కవిత కూడా ఆనాటి టీఆర్ఎస్ ఈనాటి బీఆర్ఎస్ లో అతి ముఖ్య భూమిక పోషించారు అనే చెప్పాలి.

మొదట్లో ఆమె అలా :

తెలంగాణా ఉద్యమ కాలంలో తెలంగాణా జాగృతి పేరుతో కవిత తన వంతు చేశారు. ఆ తర్వాత 2014లో అధికారంలోకి రాగానే ఆమె కూడా నిజమాబాద్ నుంచి ఎంపీ అయ్యారు. అలా అయిదేళ్ళ పాటు ఆమె పార్లమెంట్ లో ఉన్నారు. అయితే కవిత తనకు అందివచ్చిన అవకాశాన్ని ఎంతమేరకు వాడుకున్నారు అన్నదే కీలకమైన పాయింట్ గా ఉంది. ఆమె ఎంపీగా ఉన్నపుడే ఢిల్లీ లిక్కర్ స్కాం లో తమ వంతు పాత్ర ఉందని ఆమెని గత ఏడాది అరెస్టు చేశారు. అలా ఆమె తీహార్ జైలులో ఏకంగా ఆరు నెలల పాటు ఉన్నారు ఇది నిజంగా ఆమెకు అత్యంత కష్టతరమైన సమయంగా చెబుతారు.

ఎక్కువ ఊహించుకున్నారా :

అయితే కవిత తన స్థాయిని తన సమర్థతను ఎక్కువగా ఊహించుకున్నారా అన్న చర్చ కూడా ఉంది. ఆమె పార్టీ అధినాయకత్వం మీద విమర్శలు చేయడం ద్వారా తప్పులే చేశారు అని అంటున్నారు. ఆమె తనకు పార్టీలో కీలక స్థానం దక్కాలని ఆరాటపడ్డారు కానీ దానికి తగిన విధంగా తనకు వచ్చిన అవకాశాలను మలచుకోలేకపోయారు అని అంటారు. అందుకే ఆమె ఒక్కసారి మాత్రమే ఎంపీ అయ్యారు. రెండోసారి ఓటమి పాలు అయ్యారు. మరి పార్టీ అందించిన ప్రోత్సాహం తో ఆమె మరోసారి ఎంపీ అయి ఉంటే ఆమెకు కూడా పట్టు పెరిగేది అని అంటారు.

వారసత్వం హక్కుగా :

ఏ రంగంలో అయినా వారసత్వం అన్నది ఒకసారి మాత్రమే ఉపయోగపడే అవకాశంగా చూడాల్సి ఉంటుంది. ఆ మీదట ఎవరికి వారు తమ సొంత సత్తాకు పదుని పెట్టుకుంటేనే అందలాలు దక్కుతాయి. కానీ కవిత మాత్రం వారసత్వం విషయంలో హక్కుగా చూస్తున్నారు అన్న చర్చ వస్తోంది అన్న కేటీఆర్ మీద ఆమె ఆగ్రహంతో ఉంటూ బీఆర్ఎస్ వ్యతిరేక మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వడం క్లిష్ట కాలంలో పార్టీని ఇబ్బందులు పెట్టడం దాకా వెళ్లారని కూడా అంటున్నారు. దాంతోనే ఆమె పుట్టి పెరిగిన బీఆర్ఎస్ లో ఈ రోజు ఆమెకు తగిన మద్దతు దక్కడంలేదు అని అంటున్నారు. రాజకీయంగా తప్పటడుగులు వేస్తే ఖనుక అవి పాతాళానికే దారి చూపిస్తాయని చరిత్ర అనేఅ మార్లు నిరూపించింది అని కూడా గుర్తు చేస్తున్నారు.

పునాదిగా ఉండాల్సిన చోట :

కవిత బీఆర్ఎస్ కి పునదిగా ఉండాల్సిన నేపథ్యం నుంచి ప్రయర్థులకు ఆయుధంగా మారుతున్నారన్న చర్చ అయితే ఆ పార్టీలో ఉంది. పార్టీ తండ్రిది.



అన్న చేతికి వెళ్తోంది అన్న అక్కసుతో ఆమె చేస్తున్న తప్పులు అన్నీ కూడా బీఆర్ ఎస్ కి అతి పెద్ద తలనొప్పిగా మారాయని అంటున్నారు ఇక ఆమెను పార్టీ తానుగా సస్పెండ్ చేస్తే తనకు సానుభూతి వస్తుంది అన్న ఆలోచనతో ఆమె ఉన్నారని అంటున్నారు. కానీ బీఆర్ఎస్ పెద్దలు మాత్రం ఆమె విషయంలో పెద్దగా రెస్పాండ్ కాకుండా చేయాల్సింది అంతా ఆమెనే చేసుకోమని వదిలేసారు. దాంతో ఇపుడు ఆమె నిర్ణయం ఆమె తీసుకోవాల్సిన అనివార్యత ఏర్పడింది.

మరోసారి బహిరంగ లేఖ :

ఇదిలా ఉంటే తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పార్టీని ఇబ్బందిలో నెడుతో బహిరంగ లేఖ సంధించడం కూడా చర్చనీయాంశం అయింది. ఈ లేఖలో ఆమె ఏకంగా బీఆర్ఎస్ అధినాయకత్వం మీద తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సింగరేణి కార్మిక సంఘం నుని తనను తొలగించడం మీద ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను పార్టీలో జరుగుతున్న విషయాలను బయటపెట్టడంతోనే తన మీద కక్ష కట్టారని ఆమె ఆరోపించారు. టీజీబీకేఎస్ గౌరవాధ్యక్షురాలి పదవి నుంచి తాను అమెరికా వెళ్లినప్పుడు తొలగించడమేంటని ఇదేమి ధర్మమని ఆమె ప్రశ్నించారు. గతంలో తాను అమెరికాలో ఉన్నపుడు తాను కేసీఆర్ కి రాసిన లేఖను బయటపెట్టారని ఇపుడు కూడా తాను అమెరికాలో ఉంటే తన పదవిని తీసి అవమానించారు అని ఆమె అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు.

వెళ్ళిపోవడానికే రెడీనా :

ఇదిలా ఉంటే కవిత ఇక బీఆర్ఎస్ లో ఉండే పరిస్థితి లేదని అంటున్నారు. ఆమె వెళ్ళిపోవడానికి సిద్ధమై ఈ విధంగా అధినాయకత్వాన్ని ఇరుకున పెడుతున్నారని అంటున్నారు. ఇప్పటికే ఆమె వీలు దొరికితే చాలు బీఆర్ఎస్ మీద విమర్శలు చేస్తున్నారు. చాలా కాలంగా ఆమె తెలంగాణా భవన్ కి వెళ్లడమే మానుకున్నారు ఇపుడు ఆమె బహిరంగ లేఖ రాయడం ద్వారా తాను ఉండడం లేదని సంకేతాలు పంపుతున్నారా అని కూడా అంటున్నారు.

అవమానం అంటూ ఆగ్రహం :

తనను కీలక పదవిలో నుంచి తొలగించడం మీద ఆమె మండిపోతున్నారు. ఒక విధంగా తనకు ఇది తీరని అవమామంగా భావిస్తున్నారు. దాంతో ఆమెకు పార్టీకి రాజీనామా చేయడం తప్ప వేరే మార్గం లేదని అంటున్నారు. మరో వైపు చూస్తే బీఆర్ ఎస్ ట్యాగ్ తో ఆమె చేస్తున్న ఆరోపణలు రాస్తున్న లేఖలు ఆమె వ్యవహార శైలిని అంతా చూస్తున్న బీఆర్ ఎస్ పెద్దలు సైతం ఆమె పార్టీని వీడితే బెటర్ అని భావిస్తున్నారా అన్నది కూడా చర్చకు వస్తోంది. మొత్తం మీద చూస్తే కవిత బీఆర్ఎస్ కి గుడ్ బై కొట్టే రోజు ఎంతో దూరంలో లేదని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# ధర్మస్థల వ్యవహారం అంతా ఉత్తిదే

బెంగళూరు, ధర్మస్థల వ్యవహారం అంతా తూచ్ .. అన్నట్లుగా తయరయ్యింది. కర్ణాటకలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మస్థల సామూహిక మృతదేహాలు ఖననం కేసు కీలక మలుపు తిరిగింది. వందలాది మృతదేహాలను స్వయంగా తన చేత్తోనే ఖననం చేశానని ఫిర్యాదు చేసిన మాస్క్ మ్యాన్ భీమా అసలు రంగు బయటపడింది. పారిశుద్ధ్య కార్మికుడు ఇన్నాళ్లూ చేసిన ఆరోపణలు బూటకమేనని సిట్ అధికారుల దర్యాప్తులో తేలింది. తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుదోవ పట్టించిన మాస్క్ మ్యాన్‌ను సిట్ అధికారులు అరెస్టు చేశారు. ధర్మస్థల ఆలయ పరిసరాల్లో సుమారు 100కు పైగా మృతదేహాలను ఖననం చేశానంటూ భీమా 15 రోజులుగా ఆడుతున్న నాటకానికి సిట్ బృందం తెరదించింది. మాయమాటలతో వ్యవస్థను నమ్మించి విచారణలో పదేపదే తన వాదనలు మార్చిన భీమా చివరకి ఏమీ తెలియదని చేతులు ఎత్తేశాడు. దీంతో ప్రణబ్ మహంతి నేతృత్వంలోని సిట్ బృందం పారిశుద్ధ్య కార్మికుడు భీమాను అదుపులోకి తీసుకుంది. ఇంత డ్రామా ఆడటానికి కారణాలేంటని రాబట్టేందుకు సిట్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. విచారణ అనంతరం భీమాను కోర్టులో హాజరు పరచనున్నారు. ఈ కేసులో మరో కీలక వ్యక్తి అయిన బెంగళూరుకు చెందిన సుజాత భట్‌పైనా విచారణ కొనసాగుతోంది. ఆమె, తన కుమార్తె అనన్య భట్ 2003లో ధర్మస్థలలో అదృశ్యమైందని ఫిర్యాదు చేసింది. కానీ, తాజాగా ఆమె ఆ ఆరోపణలను తిరస్కరించింది. దీంతో సుజాతను కూడా పోలీసులు అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ధర్మస్థల శైవ క్షేత్రంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసిన భీమా అనే వ్యక్తి కొన్నాళ్ల క్రితం సంచలన ఆరోపణలు చేశాడు. 1995 నుండి 2014 మధ్య లైంగిక వేధింపులకు గురై హత్య చేయబడ్డ 100కు పైగా మహిళలు, పిల్లల మృతదేహాలను తాను పూడ్చిపెట్టానని.. 2014లో తమ కుటుంబంలోని ఓ యువతిని లైంగికంగా వేధించి హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయడం దేశ వ్యాప్తంగా కలకలం చెలరేగింది. పశ్చాతాపం వెంటాడుతుండటంతోనే ఈ ఫిర్యాదు చేసినట్లు– భీమా వివరణ ఇచ్చుకున్నాడు. దీంతో ప్రభుత్వం దర్యాప్తు కోసం ప్రణబ్ మహంతి నేతృత్వంలోని సిట్ బృందాన్ని రంగంలోకి దింపింది. భీమా చెప్పిన ప్రకారం పలు చోట్ల సిట్ అధికారులు తవ్వకాలు జరిపారు. కేవలం రెండు ప్రదేశాల్లోనే కొన్ని ఎముకలు కనిపించాయి. స్పష్టమైన ఆధారాలు లభించకపోవడంతో సిట్ అధికారులకు ఫిర్యాదుదారుడైన భీమా ఆరోపణలపై అనుమానం రేకెత్తింది. దీంతో లోతుగా దర్యాప్తు నిర్వహించగా ఆశ్చర్యకరమైన నిజాలు వెల్లడయ్యాయి. విచారణలో భీమా కూడా మాట మార్చాడు. వేరెవరో ఒక పుర్రె ఇచ్చి పోలీసులకు ఇమ్మన్నారని.. కోర్టులో పిటిషన్ కూడా వారే వేయించారని.. నేను 2014 నుంచి తమిళనాడులోనే ఉన్నానని అతడు పేర్కొనడంతో సిట్ అధికారులకు దిమ్మతిరిగి పోయింది. దీంతో ఇదంతా డ్రామాగా గుర్తించి భీమాను అరెస్టు చేశారు. అతడు అబద్ధాలు చెప్పి, ప్రజలను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ఇప్పటికే అతడు మాట మార్చిన సంగతి తెలిసిందే. తప్పుడు సమాచారంతో ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుదారి పట్టించాడన్న అభియోగాలపై భీమాను ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిన్న రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సిట్ ప్రధాన అధికారి ప్రణబ్ మోహంతీ అతడిని విచారించారు. మాయమాటలతో మొత్తం వ్యవస్థను నమ్మించి చివరికి ఏమీ తెలియదని చేతులు ఎత్తేశాడని ఈ దర్యాప్తులో విచారణ బృందం గుర్తించింది. దీంతో అతడిని అరెస్టు చేసింది. దక్షిణ కన్నడ జిల్లాలో ధర్మస్థల ప్రముఖ శైవ క్షేత్రం. కర్ణాటక ప్రజలతో పాటు– పొరుగు రాష్ట్రాల నుంచీ ఇక్కడికి భారీగా వస్తుంటారు. గతంలో అక్కడ పనిచేసి వెళ్లిపోయిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు.. ఇటీవల సంచలన ఆరోపణలు చేయడంతో దేశమంతా ఉలిక్కిపడింది. ఇకపోతే ధర్మస్థల పుణ్యక్షేత్రంపై అనవసర ఆరోఫలు చేయడం తగదని బీజేపీ నాయకులు శుక్రవారం నగరంలో ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. ఒక మతిస్థిమితం లేని వ్యక్తి, అదీ ఎవరోడబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తుల మాటల ఆధారంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు– చేయడం సిగ్గుచేటని సీఎంపై నిప్పులు చెరిగారు. హిందుత్వాన్ని దెబ్బతీసే విధంగా కొందరు వ్యక్తులు కావాలనే ధర్మస్థలపై నిందలు వేశారని అన్నారు.

# ఎవరి బలం ఎంత? మైనస్ లు ఏంటి?



న్యూఢిల్లీ,భారత ఉపరాష్ట్రపతి ఎన్నిక కోసం అధికార ప్రతిపక్షాలు బరిలో దిగాయి. ఎన్డీయే కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ప్రకటించింది. ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని బరిలో దింపింది. సార్వత్రిక ఎన్నికలను తలపిస్తున్న ఈ ఎన్నికల్లో ఎవరి బలం ఎంతంటే?: భారత ఉపరాష్ట్రపతి ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. అధికార ప్రతిపక్షాలు ఇద్దరు అభ్యర్థులను బరిలో దింపాయి. ఎన్డీయే కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ప్రకటించింది. ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని బరిలో దింపింది. రెండు కూటమిల బలబలాలు ఎలా ఉన్నా ఈ ఎన్నికలు సార్వత్రిక ఎన్నికలను తలపిస్తున్నాయి. అధికార ఎన్డీయే కూటమి అభ్యర్థి విజయం ఖాయమని లెక్కలు చెబుతున్నా.. అయితే రాజకీయ, వ్యూహాత్మక ప్రాధాన్యం దృష్ట్యా ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.ఇండియా కూటమికి అవసరమైన మెజారిటీ లేకపోయినా అభ్యర్థిని పోటీలో నిలబెట్టడంపై పెద్ద వ్యూహం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వానికి ఏకగ్రీవ ఎన్నికతో నైతిక విజయాన్ని ఇవ్వకూడదన్న వ్యూహంలో భాగంగానే ఇండియా కూటమి తన అభ్యర్థిని పోటీకి దింపిందని పరిశీలకులు భావిస్తున్నారు. అదే సమయంలో విపక్ష కూటమి ఏకతాటిపై ఉందనే సందేశం ఇవ్వడం కూడా అందులో భాగమేనని తెలుస్తోంది. ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలను వ్యతిరేకించే జేడీయూ, టీడీపీ వంటి లౌకికవాద పార్టీలు అదే నేపథ్యం ఉన్న వ్యక్తికి మద్ధతు ఇవ్వడాన్ని భవిష్యత్తులో ఇరకాటంలో పెట్టడానికి కూడా ఈ ఎన్నిక వారికి ఉపకరించనుంది. రాధాకృష్ణన్, జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇద్దరూ దక్షిణ భారతదేశానికి చెందినవారే కావడంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక మరింత రసవత్తరంగా మారింది. ఈ నేపథ్యంలో ఇద్దరు అభ్యర్థుల వ్యక్తిగత విషయాలతో పాటు వారి బలబలాలను ఒక్కసారి పరిశీలిద్దాం.

ఎన్డీఏ కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ :

తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్ పూర్తి పేరు చంద్రాపురం పొన్నుస్వామి (సీపీ) రాధాకృష్ణన్. ఆయన 20 అక్టోబర్ 1957న తమిళనాడులోని తిరుప్పూర్‌లో జన్మించారు. చిన్నతనంలోనే ఆర్ఎస్ఎస్ స్వయంసేవక్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. తొలిసారి1974లో భారతీయ జనసంఘ్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత రెండుసార్లు (1998, 1999) కోయంబత్తూరు నుంచి లోక్‌సభ ఎంపీగా గెలుపొందారు. పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న ఆయన టెక్స్‌టైల్స్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, పీఎస్‌యూలు, ఫైనాన్స్ కమిటీల్లో సభ్యుడిగా కీలక బాధ్యతలను నిర్వర్తించారు. ఆ తర్వాత తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా (2004%–%2007) కూడా పని చేశారు. కాయిర్ బోర్డు ఛైర్మన్ (2016%–%2020) ఉన్నారు. అనంతరం ఆయన బీజేపీ కేరళ రాష్ట్ర ఇన్‌చార్జ్ (2020%–%2022) కూడా పనిచేశారు. రాధాకృష్ణన్ 2023లో జార?ండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. అదే సమయంలో తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు.జూలై 2024 నుంచి మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఎన్డీఏ అభ్యర్థిగా ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేస్తున్నారు.

ఇండియా కూటమి అభ్యర్థి : జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి :

ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న జస్టిస్ బి సుదర్శన్ రెడ్డిది తెలంగాణ. సుదర్శన్ రెడ్డి1946 జూలై 8న రంగారెడ్డి జిల్లా ఆకులమైలారంలో జన్మించారు. న్యాయవాద విద్యను అభ్యసించిన ఆయన 1971 డిసెంబర్ 27న తొలిసారి హైదరాబాద్‌లో అడ్వొకేట్‌గా తన ప్రాక్టీస్ మొదలు పెట్టారు... దాని కోసం బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో తన పేరు నమోదు చేయించుకున్నారు. రిట్ పిటిషన్లు, సివిల్ విషయాల్లో సుదర్శన్ రెడ్డి ప్రాక్టీస్ చేశారు. 1988–1990 మధ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్లీడర్‌గా కూడా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. ఉస్మానియా యూనివర్సిటీకి లీగల్ అడ్వైజర్‌గా, స్టాండింగ్ కౌన్సెల్‌గా కూడా పనిచేశారు. 1995 మే 2న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005 డిసెంబర్‌లో గువాహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమోషన్ పొందారు. 2007 జనవరి 12న తొలిసారి సుప్రీం కోర్టు జడ్జిగా పదోన్నతి పొందిన ఆయన 2011 జూలై 8న పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ అనంతరం 2013లో గోవా మెట్టమొదటి లోకాయుక్తగా నియమితులయ్యారు. అయితే ఆయన తన వ్యక్తిగత కారణాల వల్ల ఎక్కువకాలం పనిచేయలేదు. కేవలం ఏడు నెలల్లోనే తన పదవీకి రాజీనామా చేశారు.

కూటముల బలబలాలు :

రెండు కూటములు తమ అభ్యర్థుల గెలుపుకోసం మద్దతు కూటగడుతున్నాయి. పార్లమెంట్‌లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు కలిపి 781 మంది ఓటర్లు ఉన్నారు. మెజార్టీకి 391 ఓట్లు అవసరం అవుతాయి. ప్రస్తుతం ఎన్డీయే కూటమికి 425 ఓట్ల ఉండగా.. వైసీపీకి ఉన్న ఏడుగురు ఎంపీల మద్దతు ఎన్డీయేకేనని ప్రకటించడంతో ఎన్డీయే బలం 432కు చేరింది. ఇక ఇండియా కూటమికి 311 ఓట్లు మాత్రమే ఉన్నాయి. ఈ లెక్కన ఎన్డీఏ కూటమికే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒకవేళ ఎన్డీఏ కూటమిలోని కొంత మంది ఇండియా అభ్యర్థికి ఓటు వేస్తే.. అప్పుడు పరిస్థితులు మారిపోయే అవకాశం ఉంది. అదే సమయంలోఅయితే జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలంగాణకు చెందిన వాడు కావడంతో టీడీపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఇరుకున పడ్డాయి. తెలుగువాడు కావడంతో టీడీపీ, తెలంగాణ వాడు కావడంతో బీఆర్ఎస్, ఎంఐఎం మద్దతు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే టీడీపీ ఎన్డీయే కూటమిలో ఉన్నందున అటే ఓటు వేసే అవకాశం ఉంది. బీఆర్ఎస్ కు 4 రాజ్యసభ సభ్యులు, ఎంఐఎంకు ఒక లోక్‌సభ ఎంపీ ఉన్నారు. ఈ ఐదుగురు ఇండియా కూటమికి ఓటు వేసినా గెలుపు కష్టమే. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో ఎవరు గెలుస్తారనేది ఉత్కంఠగా మారింది.

## కేంద్ర పథకాలను సద్వినయోగం చేసుకోవాలి

గుంటూరు, కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునే విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పీఎం జేవీకే, పీఎం సూర్యఘర్ పథకాల అమలు, క్షేత్రస్థాయి సమస్యలపై గుంటూరు కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. మైనారిటీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించే పీఎంజేవీకే పథకంలో జగన్ తప్పుడు బిల్లులు పెట్టి మోసం చేశారని ఆరోపించారు. కేంద్రం నిర్వహించిన ఆడిట్‌లో ఈ విషయం వెల్లడైందన్నారు. ఆ తప్పులు సరిదిద్ది గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మైనారిటీ–రెసిడెన్షియల్ స్కూల్, జీజీహెచ్ విస్తరణ పనులు, ఆటోనగర్‌లో కార్మికుల కోసం

# షాక్ తప్పదా?

హైదరాబాద్,గత ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా పాలకుర్తిలో ఓటమిపాలై మరో నియోజకవర్గానికి వలసవెళ్లిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు మళ్ళీ తన ప్లాన్ మార్చుకున్నారట. ఎక్కడ పోగొట్టుకున్నామో%ౌ% అక్కడే వెతుక్కోవాలన్నట్లు పాలకుర్తిలో రీఎంట్రీ ఇచ్చారంట. ఇన్ ఫ్రంట్ క్రొకడైల్ ఫెస్టివల్ అంటూ ప్రత్యర్థులకు సిగ్నల్స్ ఇస్తున్నారట. ఓటమి ఎరుగని నేతగా గుర్తింపుపొందిన ఆ రాజకీయ దిగ్గజానికి గత అసెంబ్లీ ఎన్నికల్లో తీవ్ర పరాభవం ఎదురైంది. రాజకీయ ఓనామాలు తెలియని యశస్వినిరెడ్డి చేతిలో భారీ ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. అసలు ఆ ఓటమి భారంతో వెళ్లిపోయిన ఆ నాయకుడు మళ్ళీ ఎందుకు వ్యూహం మార్చినట్లు..?

పాలకుర్తిలో ఓటమి పాలైన ఎర్రబెల్లి దయాకరరావు

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పాలకుర్తి సెగ్మెంట్లో ఓటమి చవిచూశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి యశస్విని రెడ్డి చేతిలో దాదాపు 50వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. దారుణ ఓటమి తర్వాత పాలకుర్తి నియోజకవర్గానికి దూరంగా ఉంటూ వచ్చారు. నియోజకవర్గాల పునర్విభజన అంశం తెరపైకి రావడం, అతిపిన్న వయసుకురాలి చేతిలో దారుణ ఓటమి కారణంగా పాలకుర్తికి ఎర్రబెల్లి దాదాపుగా గుడ్ బై చెప్పినట్లేనని గుసగుసలు వినిపించాయి.

వర్ధన్నపేటపై దృష్టి సారిస్తూ వచ్చిన ఎర్రబెల్లి

మరోవైపు తన సొంత నియోజకవర్గం వర్ధన్నపేటపై ఎర్రబెల్లి దృష్టి సారించారు. వర్ధన్నపేట నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తూ, చేరికలను ప్రోత్సహిస్తూ వర్ధన్నపేట నియోజకవర్గంలో తన గత వైభవాన్ని తిరిగి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఎర్రబెల్లి పాలకుర్తి నియోజకవర్గం నుండి వర్ధన్నపేట నియోజకవర్గానికి మకాం మార్చినట్లు జోరుగా చర్చలు సాగాయి. పాలకుర్తిలో బీఆర్ఎస్ పార్టీ మనుగడ కోల్పోతోందని చర్చలు జరుగుతున్న వేళ అనూహ్యంగా ఎర్రబెల్లి రీఎంట్రీ ఇచ్చారు. రైతులకు సాగునీరు అందించడంలో స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్ అయిందని, దేవాదుల నీటు అందించాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలిసి పాదయాత్ర చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుకోవడానికి ఎర్రబెల్లి వ్యూహాలు

స్థానిక సంస్థల ఎన్నికలవేళ ఎర్రబెల్లి తన ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారని, పాలకుర్తిలో ఎర్రబెల్లి హవా లేదని కాంగ్రెస్ శ్రేణులు విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతల విమర్శలకు కౌంటర్ ఇస్తూ పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో తన సత్తా చాటేలా ఎర్రబెల్లి దయాకరరావు చేరికల పర్వానికి తెరలేపారు. తాజా మాజీ సర్పంచ్ లను మొదలుకొని 100 మందికి పైగా సీనియర్ కాంగ్రెస్ నేతలకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు . దీంతో ఎర్రబెల్లి సైలెంట్ గా నియోజకవర్గంలో పట్టు సాధిస్తున్నారని చర్చ జోరుగా సాగుతోంది.

# ఉప ఎన్నికలపై ఆశ పెట్టుకున్న బిఆర్ఎస్

హైదరాబాద్,సుప్రీం కోర్టు తీర్పును గౌరవించి బీఆర్ఎస్ ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని స్పీకర్ నిర్ణయించుకున్న క్రమంలో ఏం జరగబోతుందన్న చర్చ సాగుతోంది. స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారని అంతా ఉత్కంఠగా చూస్తున్నారు. ముఖ్యంగా విపక్ష బిఆర్ఎస్ ఈ విషయంలో ఆసక్తిగా ఉంది. ఎలాంటి నిర్ణయం రాబోతందున్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఉప ఎన్నికలు రావఆలని కూడా బిఆర్ఎస్ కోరుకుంటోంది. సుప్రీం తీర్పు ఆధారంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఐదుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. అయితే మిగిలిన మరో ఐదుగురికి కూడా త్వరలో నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఫిరాయింపుల కేసు విచారణకు సంబంధించి నిర్దేశిత సమయాన్ని ఆ నోటీ-సుల్లో పేర్కొనలేదని సమాచారం. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు నిర్దేశిరచిన గడువు లోపల పది మంది ఎమ్మెల్యేలపై విచారణ పూర్తి చేసి స్పీకర్ ప్రసాద్‌కుమార్ నిర్ణయం ప్రకటిస్తారా..? లేక పెండింగ్‌లో పెడతారా..? అన్నది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటు-న్న పలువురు ఎమ్మెల్యేలు తాము బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామంటూ పలు సందర్భాల్లో ప్రకటించారు. శాసనసభ రికార్డుల్లోనూ పది మంది ఎమ్మెల్యేలూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నారు. సుప్రీంకోర్టు గడువు ముగిసేలోపు స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. బీఆర్ఎస్‌లో గెలించి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురికి శుక్రవారం నోటీసులు పంపించారు. వీరి విచారణ ముగిసిన తర్వాత మరికొందరికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నది. వచ్చే వారం నుంచి వీరి విచారణ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నది. బీఆర్ఎస్ కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని, ఫిరాయింపు నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని దాఖలైన కేసులో 3 నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని గత నెల 31న సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దానిపై అడ్వొకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో స్పీకర్ చర్చించారని సమాచారం. ఆ తర్వాతే ఆ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు- తెలుస్తున్నది. పార్టీ ఫిరాయించిన కడియం శ్రీహరి, దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్‌కుమార్, తెల్లం వెంకట్రావు, అరెకపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, కృష్ణమోహన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డిలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ కోరింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వారందరికీ నోటీ-సులు ఇచ్చి, వివరణ తీసుకొన్న తర్వాత స్పీకర్ తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. స్పీకర్ నోటీసులతో ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఏం చేస్తారనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. కాగా, తనకు నోటీసులు అందాయని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు.

# మంచి చేస్తుంటే అడ్డుపడడం సహజం

హైదరాబాద్, సాధారణంగానే ఏదైనా మంచి పని చేసేటప్పుడు కొందరూ కావాలనే అడ్డుపడుతుంటారని మూసీ విషయంలోనూ ఇదే జరుగుతోందని, భావి తరాల కోసం నీటి వనరుల పరిరక్షణలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణను రోల్ మోడల్ గా నిలుపుతామని మంత్రి శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ రీజినల్ ఛాప్టర్ ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్ లోని పార్క్ హయాత్ హోటల్ లో 'పాలసీస్ అండ్ స్ట్రాటజీస్ టూవార్డ్స్ బయోఫిలిక్ అర్బనిజం' అనే అంశంపై ఏర్పాటు-చేసిన సౌత్ జోన్ కాన్ఫరెన్స్ ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాల అభివృద్ధికి సరైన ప్రణాళికే పునాది అని అన్నారు. పర్యావరణం, సుస్థిరత లేకుండా ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదన్నారు. భవనాలను నిర్మించడమే అభివృద్ధి కాదని, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణతో కూడిన వృద్ధి ఆవశ్యకమన్నారు. ఆర్థిక భవిష్యత్తుకు పట్టణ ప్రణాళికే పునాది అని నొక్కి చెప్పారు. మనం రూపొందించే ప్రతి విధానం, కాపాడే ప్రతి అడవి, పునరుద్ధరించే ప్రతి నది, సృష్టించే ప్రతి జీవనోపాధి - ఇవన్నీ తరాల మధ్య న్యాయానికి సంకేతాలని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి, కార్బన్ - న్యూట్రల్ గ్రోత్, జల సంరక్షణ, సుస్థిర రవాణాలో తెలంగాణ అవలంభిస్తున్న విధానాలు, తీసుకున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటే సుస్థిరాభివృద్ధితో కూడిన నగరాలను అభివృద్ధి చేయొచ్చన్నారు. వాతావరణ మార్పులు, పట్టణ వరదలు, పర్యావరణ కాలుష్యం, భూగర్భ జలాల తరుగుదల, పట్టణీకరణ, తరిగిపోతున్న పచ్చదనం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని నగర ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీ-పీఐ ప్రెసిడెంట్ ఎన్ కే పటేల్, సెక్రటరీ జనరల్ కుల్ శ్రేష్ఠ, కో-ఆర్డినేటర్(-టె-క్నో అడ్మిన్) ప్రదీప్ కుమార్, ఐటీ-పీఐ - తెలంగాణ రీజినల్ ఛాప్టర్ ఛైర్మన్ ఎస్.దేవేందర్ రెడ్డి, కార్యదర్శి కె.మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరు ఎస్‌బిఐ వ్యవహారంలో విస్తుపోయే నిజాలు

చెన్నూరు, మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని ఎస్‌బీఐ-2 బ్రాంచిలో బంగారం, నగదు భారీగా అపహరణకు గురైనట్లు- అధికారులు గుర్తించారు. బ్యాంకు అధికారుల ఆడిట్ నేపథ్యంలో ఈనెల 21న ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గత 3 రోజులుగా బ్యాంకు, పోలీసు అధికారులు విచారణ జరిపారు. రూ.12.61 కోట్ల విలువైన బంగారం, రూ.1.10 కోట్ల నగదు అపహరణకు గురైనట్లు- తేలడంతో శనివారం బ్యాంకు అధికారులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్న మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం శెట్‌పల్లి గ్రామానికి చెందిన నరిగె రవీందర్ ప్రధాన సూత్రధారిగా అనుమానిస్తున్నారు. అతడితో పాటు- మరో తొమ్మిది మంది అనుమానితులను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెన్నూరు పట్టణ సీఐ దేవేందర్ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. నరిగె రవీందర్, కొంగండి బీరేశ్, నరిగె సరిత, నరిగె స్వర్ణలత అలియాస్ గోపు, ఉమ్మల సురేష్, కొదటి రాజశేఖర్, గౌద సుమన్, ఎసంపల్లి సాయికిరణ్, ఎల్.సందీప్, మోత్కూరి రమ్యలపై కేసు నమోదు చేసినట్లు- సీఐ తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టు-కుని బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఎస్‌బీఐ ప్రాంతీయ మేనేజర్ రితీశ్‌కుమార్ గుప్తా స్థానిక బ్యాంకులో విలేకరులతో మాట్లాడుతూ.. జరిగిన ఘటనపై తాము పూర్తి స్థాయిలో విచారణ జరిపి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు- చెప్పారు. బ్యాంకు ద్వారా వినియోగదారులకు ఎలాంటి ఆర్థిక నష్టం వాటిల్లదని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

# బీఆర్ఎస్‌కు సవాలుగా మారిన స్థానిక సంస్థల ఎన్నికలు..




హైదరాబాద్,అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత బీఆర్ఎస్‌లో స్థబ్ధత కొనసాగుతూనే ఉంది .. నేతల అంతా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. కారణాలు ఏవైనా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాం హౌస్ నుంచి బయటకు రాకపోతుండటంతో కేడర్‌కు పార్టీ నేతలు అందుబాటులో లేకుండా పోతున్నారన్న విమర్శలున్నాయి. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను గెలవాలని ప్రకటనలు చేస్తున్న గులాబీ పార్టీ నేతలు .. అందుకు అనుగుణంగా క్యాడర్‌ను సన్నద్ధం చేయడానికి కార్యాచరణ చేపట్టక పోతుండంతో పార్టీ శ్రేణుల్లో తీవ్ర నిరాశ నిస్పృహలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామ స్థాయిలో పార్టీ శ్రేణుల మధ్య విభేదాలు

తెలంగాణలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు బీఆర్ఎస్‌కు పెను సవాలుగా మారాయి . గ్రామస్థాయిలో నేతలంతా పోటీచేసే అభ్యర్థిపై ఏకాభిప్రాయానికి రావాలని గులాబీ పార్టీ పెద్దలు ఆదేశాలు ఇచ్చారు. అయితే ఇప్పటివరకు గ్రామస్థాయిలో నేతల మధ్య ఉన్న అగాధంను పూడ్చేందుకు పార్టీ ఎలాంటి ప్రయత్నాలు చేపట్టలేదు. పార్టీ నేతల అభిప్రాయాలు తీసుకోలేదు. ఈ తరుణంలో స్థానిక సంస్థల్లో పోటీచేసే అభ్యర్థితో ఆయా వర్గాలు ఎలా కలిసి పనిచేస్తారనేది పార్టీ కేడర్ లోనే చర్చకు దారితీస్తోంది

పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టని బీఆర్ఎస్ అధిష్టానం

రెండు సార్లు తెలంగాణలో అధికారంలోకి వచ్చిన గులాబీపార్టీ.. కేసీఆర్ వన్ మాన్‌తో పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించలేదు. ఆ క్రమంలో సార్వత్రిక ఎన్నికల్లో పరాజయాలు మూటగట్టుకుంది. ఓటమి తర్వాత మాజీ ముఖ్యమంత్రి పెద్దగా ప్రజాక్షేత్రంలో కనిపించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ ఉనికి కాపాడుకోవడానికి లోకల్ బాడీ ఎలక్షన్స్ బీఆర్ఎస్‌కు కీలకంగా మారాయి. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవాల్సిన అనివార్య పరిస్థితి నెలకొంది. ఈ గెలుపుతో పార్టీ కేడర్ లో నూతనోత్తేజం తీసుకొస్తేనే భవిష్యత్‌లో పార్టీకి మనుగడ అని అధిష్టానం సైతం భావిస్తుంది.

గ్రామ స్థాయి నేతల అభిప్రాయం తీసుకోవడం లేదని విమర్శలు

అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించే ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే మండలాల వారీగా ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తోంది. కానీ గ్రామస్థాయిలో ఉండే నేతలు, ద్వితీయ శ్రేణి నాయకుల అభిప్రాయాలను మాత్రం తీసుకోవడం లేదని పలువురు బహిరంగంగానే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అసలు పార్టీలో ఏంజరుగుతుందో తెలియదు.. కానీ గెలవాల్సిందేననే ఆదేశాలు ఇస్తే .. ఎలా విజయం సాధిస్తారనే ప్రశ్నలు సంధిస్తున్నారట.

గ్రూపులు కారణంగానే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి

మరోవైపు పార్టీలో గ్రూపులు కొనసాగుతున్నాయి. ఆ గ్రూపులే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కారణమయ్యాయని పార్టీ సీనియర్లే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ గ్రామస్థాయిలో నేతల అభిప్రాయాన్ని అధిష్టానం తెలుసుకునే ప్రయత్నం చేయడంలేదని నేతలు మదన పడుతున్నారు. ఈ తరుణంలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతుండటంతో ఎలా నేతల మధ్య సమన్వయం కుదురుతుందనేది ప్రశ్నగా మారింది. పోటీచేసే అభ్యర్థికి వ్యతిరేక గ్రూపులు ఎలా సహకరిస్తాయనేది సమాధానం లేని ప్రశ్నగా మారిందంటున్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయివరకు పార్టీ కమిటీలు లేవు. కేవలం అధ్యక్షులను మాత్రమే బీఆర్ఎస్ అధిష్టానం నియమించింది. ఏళ్ల తరబడి కమిటీలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకులు అసంతృప్తితో ఉన్నారనే చర్చ నడుస్తోంది. ఏ పదవి లేకుండా పార్టీలో ఎలా పనిచేయాలని క్యాడర్ ప్రశ్నిస్తోందంట.

తరచే ఫాంహౌస్‌లో నేతలతో కేసీఆర్ భేటీలు

ఎర్రవెల్లి ఫాంహౌజ్‌లో కేసీఆర్ తరచూ పార్టీ నేతలతో భేటీ అవుతున్నారు. నేతల మీటింగ్‌లో ఏ అంశాలు చర్చిస్తున్నారనేది బయటకు చెప్పకపోయినా%ౌ%కేసులు, ప్రాజెక్టులపై చర్చ, విచారణ కమిషన్ లను ఎలా ఎదుర్కోవాలి, పార్టీ మారిన ప్రజాప్రతినిధులపై ఎలా ఫైట్ చేయాలి అనే అంశాలపైనే చర్చజరుగుతున్నట్లు నేతలు ఆఫ్ ద రికార్డుగా చెప్తున్నారంట. మరోవైపు త్వరలో స్థానిక సంస్థలు జరగనున్న నేపథ్యంలోనూ పార్టీ స్థబ్దతుగా ఉండటంతో కేడర్ లో ఆందోళన నెలకొందంటున్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటముల నుంచి ఇంకా నాయకులు, కేడర్ బయటపడలేదు. వారిలో జోష్ నింపేందుకు పార్టీ సైతం ఎలాంటి కార్యచరణ ప్రకటించకపోవడం గందరగోళాన్ని పెంచుతోందంట.

గ్రూపులకు చెక్ పెడితేనే మెజార్టీ సీట్లు వస్తాయని సూచనలు

అయితే ఫస్ట్ గ్రామస్థాయిలో పార్టీనేతలతో ముఖాముఖీ నిర్వహించి సమస్యలను తెలుసుకొని, గ్రూపులకు చెక్ పెడితేనే స్థానిక సంస్థల్లో పార్టీ అధిష్టానం ఆశించిన విధంగా మెజార్టీ సీట్లు వస్తాయని .. లేకుంటే పార్టీకి గడ్డుకాలం తప్పదని పలువురు సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా పార్టీ చర్యలు తీసుకుంటుందా? లేదా? లేకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా గులాబీ పార్టీకి పరాభవం తప్పదా అన్నది చూడాలి.

# ఎంత పని చేశావయ్యా తుమ్మలా! ఎరువులపై ముందుచూపు ఏది?

హైదరాబాద్, రాష్ట్ర రాజకీయాల్లో మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ అనుభవం ఉన్న నేతగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు గుర్తింపు ఉంది. ముగ్గురు ముఖ్యమంత్రుల వద్ద కీలకమైన మంత్రిత్వ శాఖలు నిర్వహించారు. స్వయానా రైతు అయిన తుమ్మలకు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై అపారమైన పట్టుంది. అయినప్పటికీ ఈ వర్షాకాలం సీజన్‌లో రైతులకు యూరియా బస్తాలను సకాలంలో అందించడంలో ఘోరంగా విఫలమయ్యారనే అపవాదును మూటగట్టుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాకాలం సీజన్‌కు ముందే దిగుమతి చేయించడంలో నిర్లక్ష్యం వహించారా? లేక ఇందులో ఏమైనా లోగుట్టు ఉందా? అనే విషయంలో కాంగ్రెస్ వర్గాల్లో లోతుగా చర్చ నడుస్తోంది. మంత్రి ముందుచూపు లేకపోవడం మూలంగానే రేవంత్ రెడ్డి సర్కార్‌ను రైతులు, ప్రతిపక్షాలు నిత్యం దుమ్మెత్తిపోస్తున్నాయనే వాదనలూ ఉన్నాయి.తెలుగు రాష్ట్రాలలో తుమ్మల నాగేశ్వర్ రావు సుపరిచితులు. ఎన్టీ రామారావు, చంద్రబాబు నాయుడు, కే చంద్రశేఖర్ రావు మంత్రివర్గాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో వ్యవసాయ శాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కాలంలో యూరియా కోసం రైతులు రోడ్డెక్కలేదు. కానీ ఈనాడు ఎన్నడూ లేని విధంగా అన్ని జిల్లాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే ఒక్క బస్తా ఇస్తే చాలు అనే విధంగా ప్రాధేయపడుతున్నారు. ఈ పరిణామం రాజకీయంగా మూడు పార్టీల మధ్య కాక రేపింది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తుండగా, తమ తప్పేమీ లేదని మంత్రి తుమ్మల ఘాటుగానే స్పందిస్తున్నారు. ఈ సీజన్ లో 62 లక్షల ఎకరాల్లో వరి, 49 లక్షల ఎకరాల్లో పత్తి వేశారు. వరి, పత్తి పంటలకు ఒక సీజన్‌లో మూడు నుంచి నాలుగు సార్లు యూరియా చల్లుతారు. తొలుత వరంగల్, మహబూబ్ నగర్, అదిలాబాద్ జిల్లాల్లో కొరత కన్పించగా ఆ తరువాత అన్ని జిల్లాల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఉదయం పూట వెళ్తే గంటన్నర లోనే స్టాక్ అయిపోయిందని చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో ఈ సీజన్ కు 9.80 లక్షల టన్నుల యూరియా అవసరం ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ నుంచి యూరియా అవసరం మొదలవుతుంది. మరుసటి సీజన్ కు తగ్గట్టుగా ముందే నిల్వలు చేసుకోవాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖపైనే ఉంటుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 సంవత్సరం నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ వార్షిక ప్రణాళిక విడుదల చేయడం లేదు. ఎందుకు విడుదల చేయడం లేదని కూడా ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆనాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదు. అదే ఆనవాయితీని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం దారుణమని రైతు సంఘాల నాయకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. పంటలవారీగా వ్యవసాయ ప్రణాళిక సిద్ధం చేయాలని రైతు సంఘాలు ఎన్నో వినతులు చేసినా విన్పించుకోవడం లేదని అంటున్నారు. వ్యవసాయ ప్రణాళిక సిద్ధం చేస్తే దాని ప్రకారం ఎరువుల డిమాండ్ పై ప్రభుత్వం ఒక అంచనా వస్తుంది. అందుకు తగ్గట్టుగా నిల్వలు చేసుకోవచ్చు. ఎరువుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఇండెంట్ ను పంపిస్తే, ఆ ప్రకారంగా కేంద్రం కేటాయింపులు చేస్తుంది. రాష్ట్రానికి దిగుమతి అయిన తరువాత జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ కేటాయింపులు చేస్తుంది. అయితే అలా కాకుండా మంత్రులు, ఎమ్మెల్యేల ఒత్తిడి మేరకు కేటాయిపులు చేస్తున్నారు.

రామగుండం కంపెనీలో ఉత్పత్తి ఆగింది తెలియదా?

రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని 2021లో తిరిగి ప్రారంభించారు. ప్రతి ఏడాది ఉత్పత్తి అయ్యే 12 లక్షల టన్నుల యూరియా సామర్థ్యంలో రాష్ట్రానికి 11 శాతం వాటాను సరఫరా చేస్తారు. ఏప్రిల్ నెల 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 145 రోజులు ఉత్పత్తి జరగాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో 67 రోజులు మాత్రమే పనిచేసింది. షట్ డౌన్ కారణంగా తెలంగాణకు రావాల్సిన యూరియా తగ్గింది. అయితే ఆర్ఎఫ్ సీఎల్ లో ఉత్పత్తి ఆగిపోతే ఆ వివరాలు జిల్లా అధికార యంత్రాంగం లేదా వ్యవసాయ శాఖ ప్రభుత్వాన్ని అప్రమత్తం చేస్తాయి. ఇప్పటి



పరిస్థితిలో ఈ విషయంపై అప్రమత్తం చేశారా, చేయనట్లయితే బాధ్యత ఎవరిదనేది విచారణ చేయాలని రైతు సంఘాల నాయకులు అంటున్నారు. ఇండెంట్ ప్రకారం సరఫరా చేయనట్లయితే ఆ విషయాన్ని ఆర్ఎఫ్ సీఎల్ యాజమాన్యం కూడా వ్యవసాయ శాఖకు సమాచారం పంపిస్తుంది. రైతుల రోడ్డెక్కిన ఘటనలను పరిగణనలోకి తీసుకుంటే ఉత్పత్తి నిలిచిపోయిన విషయాన్ని, ముందస్తు దిగుమతులు చేసుకోవడంతో వ్యవసాయ శాఖ డైరెక్టర్ విఫలమయ్యారని ఇక్కడ స్పష్టమవుతున్నదని రైతు సంఘాల నాయకులు స్పష్టంచేస్తున్నారు.రెండు రోజుల క్రితం సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆర్ఎఫ్ సీఎల్ సీఈఓ అలోక్ సింఘాల్, ఎన్ఎఫ్ సీఎల్ సేల్స్ మేనేజర్ రాజేశ్ తో సమావేశం నిర్వహించారు. రాష్ట్రానికి ఆర్ఎఫ్ సీఎల్ నుండి రావలసిన యూరియా కోటాలో ఇంకా 62,473 మెట్రిక్ టన్నులు అందలేదని మంత్రి వివరించారు. ముందుగా కనీసం 50 శాతం యూరియాను ఈ వారంలోనే రెండు కంపెనీల నుండి గాని రాష్ట్రానికి పంపేలా చూడాలని సూచించారు. రైతులకు అసౌకర్యం కలగకుండా ఎరువుల పంపిణీ తక్షణమే జరగాలని మంత్రి స్పష్టం చేశారు. దీనికి స్పందించిన ఆర్ఎఫ్ సీఎల్ ఎండీ.. రాష్ట్రానికి కావలసిన యూరియాను త్వరలోనే సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

కేటాయింపులు 9.80 లక్షల మెట్రిక్ టన్నులు అయితే..

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఈ వానాకాలం సాగుకు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించింది. ఆగస్ట్ 31 నాటికి 8.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలి కానీ ఇప్పటివరకు 5.66 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా అయింది. ఇంకా 2.64 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉంది. దీంతో తెలంగాణలో యూరియా కొరత నెలకొంది. ఆగస్ట్ నెలలో యూరియా వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల రైతులు ఆందోళనగా ఉన్నారు.

బద్నాం అవుతున్న రేవంత్ రెడ్డి!

సాధారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అనే పేరుంది. రైతులకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుంది. ఈ సీజన్ లో యూరియా బస్తాలు లభించకపోవడంతో రైతులు ఉడికిపోతున్నారు. ఎక్కడికక్కడ ఆందోళనలు చేస్తున్నారు. అయినా తమ చేతికి అవి అందకపోవడంతో విధ్వంసాలకు దిగుతున్నారు. రైతు రుణ మాఫీ ఒకేసారి చేయడం, రైతు భరోసా మొత్తాన్ని పది రోజుల వ్యవధిలోపే వారి ఖాతాల్లో జమ చేయడం తో మంచి పేరు వచ్చింది. ఆ మంచి పేరు కాస్తా.. యూరియా కొరతతో మసకబారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రేవంత్ రెడ్డి సర్కార్ అంటే రైతులు ఏవగించుకునే పరిస్థితి వచ్చిందని చెబుతున్నారు. పాలనపై రేవంత్ రెడ్డికి అనుభవం లేకపోవచ్చు.. కానీ తుమ్మల నాగేశ్వర్ రావుకు అపారమైన అనుభవం ఉందని, ఎంతో అనుభవం ఉన్న ఆయన ఇలా చేశారేంటి అని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రేవంత్ సర్కార్‌ను బద్నాం చేసేందుకు ఏమైనా కుట్ర కోణం ఉందా అనేది తెలియాల్సి ఉంది. కేటాయింపుల ప్రకారం యూరియా సరఫరా చేయలేదని చెబుతున్నప్పటికీ ఇది ఒక్కరోజులో వారం రోజుల్లో జరిగే ఘటన కాదని, ఏప్రిల్ ముందు నుంచే సరఫరా లోటు సంకేతాలు ఉంటాయని వ్యవసాయ శాఖ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. కొరత అనేది వ్యవసాయ శాఖ వైఫల్యం తప్ప, ప్రభుత్వానికి సంబంధం లేదని అంటున్నారు.

# మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

ముంబై,మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్‌ప్లాజాలలో టోల్ మినహాయింపు కల్పిస్తున్నట్లు ప్రకటన చేసింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కాలుష్యం తగ్గించడంతో పాటు ఎలక్ట్రిక్ వాహనాల కొనగోలును ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలుస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో పెరుగుతన్న కాలుష్యం దృష్ట్యా మహారాష్ట్ర ప్రభుత్వం కాలుష్యం తగ్గించే దిశగా చర్యలు మొదలుపెట్టింది. ఈ మేరకు ఎలాక్ట్రిక్ వాహనాలకు టోల్ మినహాయింపు ప్రకటించింది. ఎలాక్ట్రిక్ కార్లు, బైకులకు టోల్ ఫ్రీ చేస్తూ..నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ప్రజలు ఎలాక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయడానికి మొగ్గుచూపుతారని ప్రభుత్వం అభిప్రాయం వ్యక్తం చేస్తుంది. దీనితో పాటు- రాష్ట్రంలో పెద్ద ఎత్తున్న ఎలాక్ట్రిక్ వాహనాల కంపెనీలు ఏర్పాడుతాయని భావిస్తుంది. గతంలో ఢిల్లీలో వాహన కాలుష్యంతో ఏర్పడిన పరిణామాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలోనూ వాహన కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం టోల్ ట్యాక్స్‌లను రద్దు చేస్తున్నట్లు- ప్రకటించింది.

వైకాపా భూతాన్ని పూర్తిగా భూస్థాపితం చేయాలి

# రాష్ట్రం అభివృద్ధికి వారే అడ్డుతగులుతున్నారు

కాకినాడ, వదల బొమ్మాళీ అంటున్న వైకాపా భూతాన్ని పూర్తిగా భూస్థాపితం చేస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని సిఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రం బాగు కోసం కూడా పది తరాల ముందు ఆలోచించాలన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష స్థానం దక్కకపోవడంతో, అందుకే బయట విషం చిమ్ముతున్నారు. కారు కింద సొంత కార్యకర్త పడినా పట్టించుకోరు. నెల్లూరు వెళ్లి మార్ఫింగ్ ఫొటోలతో ప్రచారం చేశారు. అమరావతి మునిగిపోయిందని వైకాపా దుష్ప్రచారం చేస్తోంది. అమరావతికి నిధులు ఇవ్వొద్దని అందరికీ లేఖలు రాశారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా అమరావతిని తయారు చేస్తాం. అమరావతి, విశాఖ, తిరుపతిని మహానగరాలుగా మారుస్తాం అన్నారు పెట్టుబడులు పెట్టేందుకు వస్తే ఎవరైనా ఆహ్వానిస్తారు. వైకాపా నేతలు మాత్రం పెట్టుబడిదారులను బెదిరిస్తారు. వైకాపా హయాంలో నకిలీ వ్యక్తులకు దివ్యాంగుల పింఛన్లు ఇచ్చారు. పింఛన్లు అర్హులకే అందాలి.. అనర్హులకు కాదు. రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతీసేలా విషప్రచారం చేస్తున్నారు. మనది విజన్ రాజకీయం.. వాళ్లది క్రిమినల్ రాజకీయం అని చంద్రబాబు వైకాపా తీరుపై మండిపడ్డా. స్వర్ణాంధ్ర కావాలంటే ప్రజల ఆలోచనా విధానం మారాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజల సహకారం, భాగాస్వామ్యంతోనే దీనిని సాధించగలమని అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభలో సీఎం పాల్గొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. దీనిని విస్మరించడం వల్లనే అంటు- వ్యాధులు వస్తున్నాయని అన్నారు. ఇందుకు ప్రధాన కారణం చెత్త, అపరిశుభ్రత అన్నారు. గత వైకాపా ప్రభుత్వం చెత్తపై పన్ను వేసింది గానీ.. చెత్త మాత్రం తీయలేదు. ప్రజారోగ్యాన్ని వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. అక్టోబరు 2 నాటికి అన్ని మున్సిపాలిటీల్లో చెత్తాచెదారం తొలగిస్తాం. గత ప్రభుత్వంలో అరాచకాన్ని సృష్టించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కార్యక్రమాలు చేస్తున్నాం. ప్రతి ఒక్కరి ఆదాయం పెరిగి.. ఆరోగ్యంగా ఉండాలనేదే నా ఏకైక కోరిక. మన ఆలోచనలు ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండాలి. ఈ ప్రపంచంలో ఏదీ వృథా కాదు.. చెత్త నుంచి సంపద సృష్టించొచ్చు. ఈ-వేస్ట్‌ను రీసైక్లింగ్‌కు పంపేలా ఆలోచనలు చేస్తున్నాం. పేదవాడి ఆరోగ్యం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పెద్దాపురంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తాం అని చంద్రబాబు హామీ ఇచ్చారు. సంపద సృష్టించడం.. ఆదాయాన్ని పెంచడం మాకు తెలుసు. అప్పులతో సంక్షేమ కార్యక్రమాలు చేస్తే దీర్ఘకాలం కొనసాగదు. నేను సూపర్ సిక్స్ అంటే సాధ్యం కాదన్నారు.. చేసి చూపించాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యింది. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఎప్పటికప్పుడు వారి ఖాతాల్లో నగదు జమచేస్తున్నాం. రాష్ట్రంలో 40వేల హెయిర్ కటింగ్ సెలూన్లకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు చాలా ఆనందంగా ఉన్నారు. ఏటా 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్ని వర్గాలకు మేలు చేసేందుకు కృషి చేస్తున్నాం. పీ-4 ద్వారా పేదప్రజలను ఆదుకుంటు-న్నాం. పేదలపై పన్నుల భారం తగ్గించాలని కేంద్రం యోచిస్తోందని సీఎం తెలిపారు. వైకుంఠపాళి ఆటలు మన రాష్ట్రానికి వద్దు. మనకు అభివృద్ధి కావాలి.. పేదరికం పోవాలి. పేదవాళ్లకు సాయం చేసేందుకు మార్గదర్శులు ముందుకు రావాలి. పెద్దాపురం నియోజకవర్గ సమస్యలన్నీ పరిష్కరిస్తాం. ఎన్నికల ముందు పింఛన్లు పేరుతో ఎండల్లో తిప్పి వృద్ధుల మరణానికి కారణమయ్యారు. కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ఎగతాళి చేశారని, వాటిని అమలు చేయడం సాధ్యం కాదన్నారని, అయితే తాము వాటిని అమలు చేసి చూపించామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 2047 నాటికి రాష్ట్రంలో ప్రతిఒక్కరి మోహంలో ఆనందం చూడాలని కోరుకుంటు-న్నట్టు- తెలిపారు. ప్రభుత్వం చెత్తపై పన్ను వేసింది కానీ చెత్త ఎత్తే కార్యక్రమం చెయ్యలేదు. కూటమి ప్రభుత్వం ఏడు నెలలుగా ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇంట్లో చెత్త బయట పడేయటం వలన అంటూ వ్యాధులు ప్రభలుతున్నాయి. అక్టోబర్ రెండో తేదీలోపు 85టన్నుల చెత్తను సేకరిస్తాం. టీ-డీపీ, జనసేన, బీజేపీ కలిసి ఏర్పాటు- చేసిన కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తోంది. 2047 నాటికి రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరి మొహంలో ఆనందం చూడాలి.

# సల్వాజుడుంపై అది సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ: సల్వా జుడుం తీర్పుపై కేంద్రహోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి స్పందిస్తూ అది తాను ఇచ్చినది కాదని, సుప్రీం కోర్టు తీర్పు అని స్పష్టం చేశారు.కేంద్ర హోంమంత్రితో ఈ విషయంపై నేరుగా చర్చకు దిగాలని అనుకోవడం లేదు. గతంలో ఆ తీర్పు నేనే రాశాను. కానీ, అది నా తీర్పు కాదు.. సుప్రీం కోర్టు ఇచ్చినది. 40 పేజీల ఆ తీర్పును అమిత్ షా చదవాలని ఆశిస్తున్నా. ఒకవేళ అది చదివి ఉంటే ఆ వ్యాఖ్యలు చేసి ఉండేవారు కాదు. ఇదే నేను చెప్పదలచుకున్నా. ఇంతటితో ఈ చర్చను ఆపేద్దాం అని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్యంలో లోటు కనిపిస్తోందని, రాజ్యాంగం కూడా సవాళ్లు ఎదుర్కొంటోందని ఇండియా కూటమి తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా విపక్షాలు ఎంపిక చేయడాన్ని గౌరవంగా భావిస్తున్నానని చెప్పిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి కులగణన అవసరమని ఓ ఇంటర్వ్యూలో అభిప్రాయ పడ్డారు. తెలంగాణలో కులగణనకు సంబంధించి ఆయన చొరవ తీసుకున్నారు. కుల గణనపై మాట్లాడుతూ.. సామాజిక ఆర్థిక విధానాల రూపకల్పన కోసం దీనిని చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా విపక్షాలు ఏకగ్రీవంగా ఎంపికచేయడం గౌరవంగా భావిస్తున్నా.

# రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా 25 మంది ఎమ్మెల్యేలతో కోమటిరెడ్డి సీక్రెట్ మీటింగ్?



హైదరాబాద్,కాంగ్రెస్ అంటేనే కలహాల పార్టీ. ఒకరి ఎదుగుదలను మరొకరు ఓర్వలేరు. అనైక్యత కారణంగా పదేళ్లు తెలంగాణలో అధికారానికి దూరమైంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చినా.. దానిని నిలబెట్టుకోవడం ఓ సవాల్‌గా మారింది. ఏడాదిపాటు పాలన సాఫీగా సాగింది. ఇప్పుడు అంతర్గత కలహాతో సతమతమవుతోంది. మంత్రివర్గ విస్తరణ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తికి కారణమైంది. అది క్రమంగా పార్టీ చీలికకు దారితీసే అవకాశం కనిపిస్తోంది. తాజాగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా 25 మంది ఎమ్మెల్యేలతో రహస్య సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం గురించి ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా సమాచారం రేవంత్ రెడ్డికి చేరడంతో పార్టీలో ఉత్కంఠ నెలకొంది. ఈ ఘటన తెలంగాణ రాజకీయాల్లో కొత్త మలుపులకు దారితీసే అవకాశం ఉంది.

అసంతృప్తికి కారణాలు ఏమిటి?

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గత కొంతకాలంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అసంతృప్తితో ఉన్నారు. ఈ అసంతృప్తికి ప్రధాన కారణం మంత్రి పదవి రాకపోవడం. 2023లో రాజగోపాల్ రెడ్డి బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి తిరిగి చేరినప్పుడు, మంత్రి పదవి హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, 2023 డిసెంబర్‌లో, 2024 జూన్‌లో కేబినెట్ విస్తరణలో ఆయనకు అవకాశం దక్కలేదు. ఈ నేపథ్యంలో, రాజగోపాల్ రెడ్డి రేవంత్ రెడ్డి నాయకత్వ శైలిని, ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, తీవ్ర విమర్శలు చేశారు. ఈ అసంతృప్తే రహస్య సమావేశానికి దారితీసినట్లు తెలుస్తోంది.

రహస్య సమావేశం..

రెండు రోజుల క్రితం జరిగిన ఈ రహస్య సమావేశంలో 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పాల్గొన్నట్లు సమాచారం. ఈ సమావేశం గురించి ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా సమాచారం రేవంత్ రెడ్డికి చేరడంతో, పార్టీలో అప్రమత్తత నెలకొంది. రాజగోపాల్ రెడ్డి ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నట్లు తెలుస్తోంది, ఇది పార్టీ అధిష్ఠానంతో చర్చలు జరుపుతున్నారనే ఊహాగానాలకు దారితీస్తోంది. గతంలో కూడా కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రహస్య సమావేశాలు నిర్వహించినట్లు సమాచారం. మరోవైపు రాజగోపాల్ రెడ్డి తన సోదరుడు, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహాయం కూడా పొందలేకపోయారు, దీనివల్ల ఆయన అసంతృప్తి మరింత పెరిగినట్లు కనిపిస్తోంది. ఇటీవల ఆయన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైనట్లు వార్తలు రావడం, ఢిల్లీలో ఉన్నట్లు తెలియడం పార్టీ అధిష్ఠానంతో చర్చలు జరుగుతున్నాయనే అనుమానాలను రేకెత్తిస్తోంది.

రాజకీయ సంక్షోభం తప్పదా?

ఈ రహస్య సమావేశం తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ సంక్షోభాన్ని సృష్టించే అవకాశం ఉంది. రాజగోపాల్ రెడ్డి గతంలో బీజేపీలో చేరిన చరిత్ర ఉన్నందున, ఆయన మళ్లీ పార్టీ మారతారా అనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే, ఆయన తన నియోజకవర్గం మునుగోడు కోసం పోరాడుతానని, అవసరమైతే మళ్లీ రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళతానని పేర్కొన్నారు. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి సవాల్‌గా మారనున్నాయి. మరోవైపు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించినట్లు తెలుస్తోంది. కమిటీ చైర్మన్ మల్లు రవి, రాజగోపాల్ రెడ్డితో మాట్లాడి, విషయాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు.

# బీజేపీ కొత్త అధ్యక్షులెవరు? ఈసారి ఉత్తరాదికే ఛాన్స్

న్యూఢిల్లీ, బీజేపీ కొత్త అధ్యక్షులు ఎవరు? ఎంపిక విషయం ఎందుకు ఆలస్యమవుతోంది? కొత్త అధ్యక్షుడి విషయంలో ఇటు బీజేపీ, అటు ఆర్ఎస్ఎస్ మల్లగుల్లాలు పడుతోందా? ఈసారి సౌత్ వారికి ఛాన్స్ లేదా? మళ్లీ ఉత్తరాదికే ఆ పదవి వరించనుందా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.

బీజేపీ కొత్త సారథి ఎంపిక ప్రక్రియను వేగవంతం చేస్తోంది రాష్ట్రీయ స్వయం సేవక్-%=ూా%. సెప్టెంబరు రెండోవారంలో బీజేపీకి కొత్త అధ్యక్షుడు రానున్నట్లు వార్తలు వస్తున్నాయి. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ వేదికగా సెప్టెంబర్ 5 నుంచి ఆర్ఎస్ఎస్ సమావేశాలు మొదలుకానున్నాయి. మూడురోజులపాటు జరిగే ఈ సమావేశాలను చీఫ్ మోహన్ భగవత్, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబాలేతోపాటు ఆర్ఎస్ఎస్ కీలక నేతలు, బీజేపీకి చెందిన అగ్రనేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశాల్లో కొత్త అధ్యక్షుడి ఎంపికపై చర్చించిన తర్వాత అప్పుడు ప్రకటన రావచ్చని కమలం వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆర్ఎస్ఎస్ సమన్వయకర్తలు, జాతీయ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొంటారు. బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, బీఎల్ సంతోష్, సునీల్ బన్సాల్, శివప్రకాష్,సౌదాన్ సింగ్, సతీష్ వంటి నాయకులు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో పార్టీ అంశాలు, దేశ రాజకీయాలు, ఇటీవల అమెరికా విధించిన వాణిజ్య సుంకాలు సహా అనేక అంశాలపై చర్చించనున్నారు. ఇదిలా ఉండగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆగస్టు 26 నుంచి 28 వరకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో సమావేశం కానున్నారు. ఆ భేటీలో ప్రముఖులు అడిగే ప్రశ్నలకు ఆయన సమాధానం ఇవ్వనున్నారు. 2018 సెప్టెంబర్ తర్వాత విజ్ఞాన్ భవన్‌లో ఆర్ఎస్ఎస్ ఆ తరహా కార్యక్రమాన్ని ఇప్పుడే నిర్వహించనుంది. బీజేపీ అధ్యక్ష పదవి ఈసారి ఉత్తరాది వారికి దక్కనున్నట్లు తెలుస్తోంది. దక్షిణాదిలో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయని, వారు ఎన్డీయే కూటమిలో ఉన్నారని అంటున్నారు. తొలుత దక్షిణాదివారికి



బీజేపీ అధ్యక్ష పదవి దక్కుతుందని బలంగా వార్తలు వచ్చాయి. అయితే ఉపరాష్ట్రపతి రేసులో తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్ ఎన్నిక దాదాపు ఖాయమని బీజేపీ భావిస్తోంది. ఇదే సమయంలో బీజేపీ చీఫ్ ఉత్తరాది వారికి ఇస్తే బాగుంటుందని అంచనాలు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఉత్తరాదిలో పార్టీ బలహీన పడితే కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు పుంజుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారట కమలనాధులు. బీజేపీ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో కుల సమీకరణాలు, ప్రజాదరణ, రాజకీయ వివరాలను పరిగణనలోకి తీసుకోనున్నారట. ఉపరాష్ట్రపతి అభ్యర్థి విషయంలో ఇదే విధమైన ప్రక్రియను ఉపయోగించారు కమలనాధులు. రాధాకృష్ణన్ పేరు ప్రకటించే ముందు 100 మందికి పైగా వ్యక్తులను సంప్రదించినట్లు బీజేపీలోని ఓ సీనియర్ నేత వెల్లడించారు. 2014 నుండి ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ బీజేపీ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోలేదు. కానీ ఈసారి రెండింటి మధ్య గ్యాప్ కారణంగా ఆర్ఎస్ఎస్ ఓ అడుగు వెనకేసిందన్నారు. పార్టీ అధ్యక్ష ఎన్నిక ముందుకు సాగాలంటే 36 రాష్ట్రాలలో కనీసం 19 రాష్ట్రాల్లో కొత్త అధ్యక్షులను నియమించాలని పార్టీ రాజ్యాంగం చెబుతోంది. ఇంకా అధ్యక్షులను నియమించని రాష్ట్రాలు యూపీ, గుజరాత్, కర్ణాటక వంటి కీలకమైన రాష్ట్రాలు ఉన్నాయని అంటున్నారు.

# ధర్మస్థల చిన్నయ్య పెద్ద అబద్ధాల కోరు..భీమా భార్య

బెంగళూర్ :చిన్నయ్య అబద్ధాలు చెప్పడం కొత్తేమీ కాదని అంటున్నారు అతని భార్య రత్నమ్మ. మా ఇద్దరికీ 1999లో పెళ్ళయిందని చెప్పారు. తానొక సివిక్ వర్కర్ గా చేశానని తెలిపారు. తమక ఇద్దరు పిల్లలు ఉన్నారు. తరువాత 2006లో విడిపోయామని రత్నమ్మ చెప్పాను. చిన్నయ్య అలియాస్ భీమా తనను తీవ్రంగా కొట్టేవాడని...అందుకే విడిపోయానని చెప్పారు. విడాకుల సమయంలో కూడా అతను చాలా అబద్ధాలు చెప్పాడని...తనకు ఇవ్వాల్సిన భరణం ఎగ్గొట్టేందుకే అలా చేశాడని ఆరోపించారు. కోర్టు కూడా అతని మాటలనే నమ్మిందని రత్నమ్మ అన్నారు. దాని వలన తనకు, తన పిల్లలకు చాలా అన్యాయం జరిగిపోయిందని వాపోయారు.

మొదటి నుంచీ అబద్ధాలకోరే..

చిన్నయ్య తనతో ఉన్నన్నాళ్ళూ ఎప్పుడూ అత్యాచారాలు, సామూహిక ఖననాల గురించి చెప్పలేదని రత్నమ్మ చెప్పారు. డబ్బు కోసమే ధర్మస్థల వివాదంలో తలదూర్చాడని చెప్పుకొచ్చారు. 2014లో చిన్నయ్య ధర్మస్థల నుంచి వెళ్ళిపోయాడు. ఆమెను తన ఊళ్ళో వారికి భార్యగా చెప్పాడు. అతనికి మూడు సార్లు పెళ్ళి అయిందని స్థానికులు చెబుతున్నారు. కానీ అందరి నుంచీ విడిపోయి..ఇప్పుడు ఒంటరిగానే ఉంటున్నాడని అన్నారు. చిక్కబల్లికి చెందిన బాలు అనే వ్యక్తి మాట్లాడుతూ చిన్నయ్య డబ్బుకోసం ఏమైనా చేస్తాడని ఆరోపించాడు. 2014లో వెళ్ళిపోయిన అతను తరిగి మళ్ళీ 2024లో ధర్మస్థలకు వచ్చాడు. గ్రామ పంచాయతీ చూపించిన ఖాళీ స్థలంలో షెడ్డు వేసుకున్నాడు. ఆ స్థలాన్ని తనపేరిట రాసి ఇవ్వాలని పంచాయతీ సిబ్బందితో గొడవ పెట్టుకున్నాడని గ్రామ ప్రజలు సెట్ అధికారులకు తెలిపారు. తప్పుడు సమాచారంతో ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుదారి పట్టించాడని ముసుగు వ్యక్తి భీమాను సిట్ అధికారులు అరెస్టు చేశారు. ధర్మస్థలకు చెడ్డపేరు తెచ్చే ప్రయత్నం చేశాడనే అభియోగంతో అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల ధర్మస్థల వ్యవహారం



జాతీయ స్థాయిలో దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఆ ప్రాంతంలో వందలాది మంది మృతదేహాలను తాను పూడ్చిపెట్టానని మాజీ పారిశుద్ధ్య కార్మికుడు భీమా ఆరోపణలు చేశారు. అందులో ఎక్కువగా అత్యాచారం, హత్యలకు గురైన మహిళలవే ఉన్నట్లు తెలిపాడు. దీంతో రంగంలోకి దిగిన సిట్ అధికారులు తవ్వకాలు ప్రారంభించారు. కానీ మృతదేహాలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. అయితే శుక్రవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు సిట్ ప్రధాన అధికారి అయిన ప్రణబ్ మహంతి.. భీమాను విచారించారు. అతడు మాయమాటల చెప్పి వ్యవస్థను నమ్మించి చివరికి ఏమీ తెలియదని అంటున్నాడని సిట్ విచారణలో గుర్తించారు. ఈ క్రమంలోనే అధికారులు భీమాను అరెస్టు చేశారు. శనివారం అతడిని కోర్టులో హాజరుపర్చనున్నారు. అంతకు ముందు కూడా భీమా ఈ కేసు విషయంలో మాట మార్చాడు. తనకు ఒకరు పుర్రె ఇచ్చి సిట్ అధికారులకు ఇవ్వాలని చెప్పారని.. కోర్టులో అర్జీ కూడా వారే చేయించారని పేర్కొన్నాడు. 2014 నుంచి తాను తమిళనాడులోనే ఉంటున్నానని చెప్పాడు. దీంతో ధర్మస్థల వ్యవహారం మలుపు తిరిగింది.

# దసరా తరువాత...జనంలోకి జగన్ !



అమరావతి,వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ పార్టీని గాడిన పెట్టేందుకు భారీ కసరత్తునే చేస్తున్నారు. గద పదిహేను నెలలుగా ఆయన పార్టీ నాయకులతో సమావేశాలు వారికి దిశా నిర్దేశం చేస్తూ సాగారు. అలాగే పరామర్శలు ఓదార్పు యాత్రలు మధ్య మధ్యలో చేశారు అయితే వైసీపీలో చాలా కాలంగా ఉన్న ఒక ప్రచారం జగన్ జనంలోకి వస్తారు అని ఆయన జిల్లాల టూర్లు వేస్తారు అని. అది కాస్తా వాయిదాల మీద వాయిదాలు పడుతోంది. చివరికి ఒక మంచి ముహూర్తమే సెట్ అయింది అన్నది తాజా సమాచారం గా ఉంది మరి.

విజయదశమి తరువాత :

ప్రస్తుతం భాద్రపద మాసం నడుస్తోంది. దీనిని శూన్య మాసం అంటారు. సెప్టెంబర్ నెలాఖరు నుంచి ఆశ్వయుజ మాసం వస్తుంది. అలా మంచి రోజులు అన్నీ అపుడే ఉన్నాయి. విజయదశమి తెలుగు వారికి పెద్ద పండుగ. దాంతో నవరాత్రులలో అంతా బిజీగా ఉంటారు. ఈ పండుగ సందడి అంతా ముగిసిన తరువాత ఒక మంచి వేళ చూసుకుని జగన్ జిల్లా టూర్లకు రెడీ అవుతారు అని అంటున్నారు.

ఉత్తరాంధ్ర నుంచేనట :

ఇక జగన్ జిల్లాల టూర్లకు ఉత్తరాంధ్ర జిల్లాలను ఎంచుకుంటున్నారు అన్నది కూడా ప్రచారంలో ఉంది. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం నుంచి ఆయన జిల్లా యాత్రలు స్టార్ట్ అవుతాయని చెబుతున్నారు. అలా నెలలో కనీసంగా రెండు జిల్లాలు వంతున ఆయన పర్యటనలు సాగుతాయని చెబుతున్నారు. ఆయా జిల్లాల టూర్లలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలోని పార్టీ బాధ్యులు కీలక నాయకులతో జగన్ సమావేశాలు సమీక్షలు నిర్వహిస్తారని గ్రౌండ్ లెవెల్ లో పార్టీ ఏ విధంగా ఉంది అన్నది ఆయన పూర్తిగా తెలుసుకుంటారు అని అంటున్నారు.

రెండేళ్ళ పాటు టూర్లు :

ఇక ఈ జిల్లా టూర్లు దాదాపుగా రెండేళ్ల పాటు జరుగుతాయని అంటున్నారు అంటే 2027 దాకా అని అంటున్నారు. ఆ తర్వాత వైసీపీ అధినేత మహా పాదయాత్రకు అప్పటి నుంచి 2029 ఎన్నికల వరకూ శ్రీకారం చుడతారు అని అంటున్నారు. గతానికి కంటే భిన్నంగా మరిన్ని మారు మూల గ్రామాల్లో జగన్ పాదయాత్ర ఈసారి ఉంటుందని చెబుతున్నారు. గతంలో జగన్ 37 వేల కిలోమీటర్ల భారీ పాదయాత్ర చేశారు. ఈసారి అయిదు వేల కిలోమీటర్ల దాకా ఈ పాదయాత్ర ఉండొచ్చని అంటున్నారు. మొత్తం మీద తొలి ఏణ్ణర్థం అధికార పార్టీకి హానీ మూన్ పీరియడ్ గా వదిలేసిన జగన్ మిగిలిన కాలాన్ని మాత్రం పవర్ ఫుల్ యాక్షన్ ప్లాన్ తో సెట్ చేసారు అని అంటున్నారు. జగన్ జనంతో మమేకం అవుతూనే 2029 ఎన్నికలకు వెళ్తారు ఇక మీదట జగన్ ఉండేది జనంలోనే అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సో ఆ ప్రకటన కోసం ఇక వేచి చూడాల్సిందే అని అంటున్నారు.

# నేషనల్ హైవేలపై మరణ మృదంగం..



న్యూఢిల్లీ: దేశంలోని జాతీయపై జరుగుతున్న ప్రమాదాల్లో వేలాది మంది దుర్మరణం చెందారు. ఈ ఏడాది జూలై 17 వరకు ఈ తరహా ప్రమాదాల్లో 26,770 మంది చనిపోయారని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల పార్లమెంట్‌లో ఎంపీ శశ్మిత్ పాత్ర అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. గత రెండేండ్లలో ఏటా 50 వేలకు పైగా మరణాలు జాతీయ అవార్డుపై సంభవిం చాయి. పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో ప్రమాదాలకు అవకాశం ఉన్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి వాటిని సరిదిద్దడంపై కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ దృష్టి సారించాయి. ఇప్పటివరకు 8,542 బ్లాక్ స్పాట్‌లకు స్వల్ప కాలిక మరమ్మతులు, 3,144 చోట్ల దీర్ఘ కాల మరమ్మతులు చేశారు. దీర్ఘ కాలిక రోడ్డు సవరణల్లో రోడ్డు జ్యామితి మెరుగుదల, కూడళ్ల పునర్నిర్మాణం, క్యారేజ్ వే విస్తరణ, అండర్ పాస్, ఓవర్ పాస్‌ల నిర్మాణం ఉంటాయని మంత్రి వరకు. ఈ భూ సేకరణ, అనుమతుల నిర్మాణం అవసరం కావడంతో సహజంగానే పనుల పూర్తికి గణనీయ సమయం పడుతుందని తెలిపారు. హైపై ప్రమాదాల నివారణకు ఏఐ ఆధారిత అత్యాధునిక ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థలు(ఏటీఎంఎస్), వీడియో సంఘటన గుర్తింపు, అమలు వ్యవస్థలు(వైడ్స్) అమలు చేస్తున్నట్టు చెప్పారు.

# విశాఖ నుంచి 'యుద్ధ నౌకల' సన్నద్ధం!

విశాఖ:సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం ఏపీ సొంతం. దాదాపు 1000 కిలోమీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. ముఖ్యంగా ఈస్ట్ కోస్ట్ నౌకాదళ కేంద్రంగా విశాఖ ఉంది. రోజురోజుకు ఈస్ట్ కోస్ట్ నౌకాదళ కేంద్రానికి కేంద్రం ప్రాధాన్యమిస్తోంది. అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన నౌకలను, ఇతర పరికరాలను అందించి బలోపేతం చేస్తోంది. ఇది ఒక విధంగా చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాధాన్యమిచ్చినట్టే. ఇటువంటి పరిస్థితుల్లో రేపు రెండు యుద్ధ నౌకలను విశాఖ కేంద్రంగా జాతికి అందించనుంది భారత నావికాదళం. నౌకాదళ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లెక్కించేలా ఈ రెండు యుద్ధ నౌకలు రేపు జాతి ముందుకు రానున్నాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఈ రెండు అత్యాధునిక నౌకలు తమ సేవలను ప్రారంభించనున్నాయి. జాతికి అంకితం చేసేందుకు నౌకాదళ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

రేపు విశాఖ డాక్ యార్డులో..

రేపు విశాఖ నావల్ డాక్ యార్డులో ఈ యుద్ధ నౌకల ఆవిష్కరణ కార్యక్రమం కొనసాగనుంది. ప్రాజెక్టు 17 లో భాగంగా ఆత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎంఎస్ ఉదయగిరి యుద్ధ నౌకల ఆవిష్కరణ కార్యక్రమం జరగనుంది. దీనికి ముఖ్య అతిథిగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, భారత నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి హాజరుకానున్నారు. ముంబైలోని మజ్ గావ్ డార్క్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ లో ఐఎన్ఎస్ ఉదయగిరి.. కోల్కత్తాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ లో ఐఎన్ఎస్ హిమగిరి నౌకలను నిర్మించారు. ఇందులో భారత యుద్ధ విమాన చరిత్రలోనే.. ఐఎన్ఎస్ ఉదయగిరి నౌకను




పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించడం విశేషం.

చైనాకు ధీటుగా..

అంతర్జాతీయ నావికా రంగంలో భారత్ కు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇతర తీరదేశాలు, శత్రు దేశాలు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నాయి. అందుకే భారత నావికాదళం బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా నౌక నిర్మాణంలో విదేశీ పరిజ్ఞానాన్ని స్వస్తి పలికింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతోనే ఈ యుద్ధ నౌకల నిర్మాణాన్ని చేపడుతోంది భారత ప్రభుత్వం. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రపంచ నౌక నిర్మాణంలో అగ్రగామిగా ఉన్న చైనా దూకుడుకు కళ్లెం వేయాలని భావిస్తోంది భారత్. చైనా సగటున 19 నౌకలు తయారు చేస్తుంటే ఏడాదికి%ొా% భారత్ మాత్రం 20 యుద్ధనౌకలు నిర్మిస్తోంది. అయితే భారత్ తో పోల్చుకుంటే చైనా వాణిజ్య నౌకల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోంది.

# భారీ వరదలతో ఉప్పొంగిన సుర్వాల్ డ్యామ్..

జైపూర్: రాజస్థాన్‌లో భారీ వర్షాలు (భారీ వర్షాలు) దంచికొడుతున్నాయి. కుండపోత వానలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో సువాయ్ మాధోపూర్, నిర్వహించే జడవాటా గ్రామం వద్ద సుర్వాల్ డ్యామ్ పొంగిపోయింది. ఒక్కసారిగా వరద పోటెత్తడంతో గ్రామంలో 2 మేర జలపాతం వంటి పెద్ద గుంత ఏర్పడింది. 2 పొడవున్న గుంత 100 అడుగుల వెడల్పు, 55 లోతు అడుగులు ఉన్నది. వరద ఉధృతికి రెండు ఇండ్లు, రెండు షాపులు, రెండు దేవాలయాలు ధ్వంసమయ్యాయి. కాగా, వర్షాలు ఇలాగే కొనసాగితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. గ్రామానికి చేరుకున్న ఆర్మీ బృందాలు సహాయక చర్యలు చేపట్టారు. సమీపంలోని ఇండ్లను ఖాళీ చేయించారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కరోడి లాల్ మీనా గుంతపై ఆరా తీశారు. ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించారు. యంత్రాల సహాయంతో నీటి ప్రవాహాన్ని మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను నియమించారు. అయితే ప్రస్తుత పరిస్థితిలో భూమి కోటను ఆపడం కష్టమని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో



రాజస్థాన్‌లోని వందలాది గ్రామాలు నిటారుగా ఉన్నాయి. కోట, బుండీ, సవాయ్ మాధోపూర్, ఝూలావార్ జిల్లాలో భారీ వర్షాల ప్రభావం అధికంగా ఉంది. కోట ఏర్పాటు నిమోడ గ్రామంలో 400కి పైగా ఇండ్ల నేలకూలాయి. వంది మంది ప్రజలు పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. ఆర్మీతోపాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీ ఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నారు.

# యూపిలో ట్రాక్టర్‌ని ఢీకొన్న కంటైనర్..



లక్నో: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బులంద్‌షహర్ పిఎస్ పరిధిలోని జాతీయ రహదారిపై ఘటాల్ గ్రామ సమీపంలో భక్తులతో వెళ్తున్న ట్రాక్టర్‌ను కంటైనర్ ట్రక్ ఢీకొట్టింది. తెల్లవారుజామున 2.10 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో 61 మంది భక్తులు ఉన్నారు. భక్తులతో ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ని కంటైనర్ వెనుక నుంచి ఢీకొట్టడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎనిమిది మంది భక్తులు మృతి చెందగా.. 43 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com